తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice  వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

21-05-2026

గురువారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 107

PUBLISHED FROM HYDERABAD  పేజీలు-8  వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక

www.siridaily.com

సిరి

People's Voice  వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

epaper.siridaily.com

**విలేకరులు కావలెను**

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575


## ఫిట్‌నెస్ ఉంటేనే
# బస్సు కదులుద్ది!

- విద్యాసంస్థల ప్రారంభానికి ముందే రవాణా శాఖ నోటీసులు..
- పక్షం రోజుల ముందే అప్రమత్తం.. విద్యార్థుల భద్రతే పరమావధి..
- స్కూళ్లు, కాలేజీలు తెరిచే లోపే రవాణా వాహనాలపై ప్రత్యేక ఫోకస్
- నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్.. క్రిమినల్ కేసులు
- తెలంగాణవ్యాప్తంగా 32 వేల ప్రైవేట్ బస్సులు..
- వాహనాల హిస్టరీతో పాటు డ్రైవర్ల ట్రాక్ రికార్డుపై ఆరా..
- ఏటా వందల సంఖ్యలో బలవుతున్న చిన్నారుల ప్రాణాలు

3






## విద్యుత్ శాఖలో
# నలుగురు నకిలీలు!

- ఆరేళ్లుగా రూ. 1.20 కోట్లు బొక్కేసిన జేఎల్ఎంలు

విజిలెన్స్ విచారణలో గుట్టు రట్టు

జీరాక్స్ సెంటర్ పేపర్‌ను ఒరిజినల్ పట్టాగా నమ్మించి ఉద్యోగం..

ఆపై దర్జాగా ఏఎల్ఎంగా ప్రమోషన్

నియామకంలో లంచాలు గుంజిన యూనియన్ ప్రతినిధులు, సబ్ ఇంజనీర్

20 ఏళ్లుగా ఒకే సీటుపై తిష్టవేసి కుంభకోణాల సామ్రాజ్యం

అధికారుల నిర్లక్ష్యంతో అసలైన నిరుద్యోగులకు అన్యాయం

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:** సంగారెడ్డి జిల్లా విద్యుత్ సర్కిల్‌లో ఒక పెద్ద కుంభకోణం వెలుగుచూసింది. కేవలం జీరాక్స్ సెంటర్ పేపర్‌ను ఒరిజినల్ సర్టిఫికెట్‌గా నమ్మించి, నలుగురు కేటుగాళ్లు జూనియర్ లైన్‌మెన్ ఉద్యోగాలు పొందారు. అంతటితో ఆగకుండా దర్జాగా ప్రమోషన్ కూడా కొట్టేసి, ఆరేళ్లుగా రూ. 1.20 కోట్ల ప్రభుత్వ ధనాన్ని జీతాల రూపంలో బొక్కేశారు. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో మేము చూసుకుంటాం అంటూ ఇద్దరు యూనియన్ నేతలు, మరో సబ్ ఇంజనీర్ సదరు అభ్యర్థుల నుండి లక్షలాది రూపాయలు గుంజినట్లు విజిలెన్స్ విచారణలో తేలింది.

మిగతా 2వ పేజీలో..



## వైభవంగా సరస్వతి నది అంత్య పుష్కరాలు షురూ

- తొలి పుష్కర స్నానమాచరించిన కంచి పీఠాధిపతి, మంత్రులు
- తరలివస్తున్న భక్తులు
- భక్తి పారవశ్యంతో పులకిస్తున్న త్రివేణి సంగమం

2



## ధరణి సమస్యలకు
# శాశ్వత పరిష్కారం

- అర్హులందరికీ భూ పట్టాలు అందిస్తాం
- జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ప్రారంభం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం, మే 21 సిరి న్యూస్:** ధరణి వ్యవస్థ వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి అర్హులైన ప్రతి ఒక్కరికీ భూ పట్టాలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలోని ఎంఆర్ గార్డెన్స్‌లో ప్రజా పాలన - ప్రగతి

మిగతా 2వ పేజీలో..



## మహిళా సాధికారతకు రాష్ట్రవ్యాప్తంగా వారోత్సవాలు

- మే 25 నుంచి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- మహిళల ఆర్థిక స్వావలంబనపై ప్రభుత్వ ప్రత్యేక దృష్టి
- జీవనోపాధి యూనిట్లు, రుణమేళాలు, ఆరోగ్య కార్యక్రమాలు
- మంత్రి సీతక్క

2





## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ..

- ఆయుధాలతో సహా లొంగిపోయిన 25 మంది మావోలు
- ఝార్ఖండ్ డీజీపీ సమక్షంలో లొంగిపోయిన 25 మంది మావోయిస్టులు
- లైట్ మెషీన్ గన్స్ సహా పలు రకాల ఆయుధాల అప్పగింత
- అందరికీ పూర్తి పునరావాసం కల్పిస్తామన్న డీజీపీ

3

## రేవంత్ అబద్ధం చెప్పారా..?
## బండి సంజయ్ అబద్ధం చెప్పారా..?



3

- భగీరథ్ అరెస్ట్‌పై సీఎం, కేంద్ర మంత్రి వ్యాఖ్యలకు పొంతనేది?
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్న
- అసలు జరిగింది అరెస్టా..? సరెండరా..? అంటూ నిలదీత

## ఎన్నాళ్లు మొద్దునిద్ర..
## రైతులపై దృష్టి పెట్టండి

పంట కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల అవస్థలపై కేటీఆర్ ఆగ్రహం

మరణించిన రైతు కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం డిమాండ్



2



## తెలంగాణకు కేంద్రం
## మరో బంపర్ గిఫ్ట్..

- రూ.5,818 కోట్లతో కొత్త రైల్వే లైన్.!
- మణుగూరు–రామగుండం కొత్త రైల్వే లైన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- మేడారం, భద్రాచలం భక్తులకు భారీ ఊరట

**తెలంగాణ బ్యూరో, మే21 సిరి న్యూస్:** తెలంగాణ రాష్ట్రంలో రవాణా రంగాన్ని సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేలా కేంద్ర ప్రభుత్వం మరో సూపర్ గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న కీలకమైన మణుగూరురామగుండం కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ అధికారికంగా

మిగతా 3వ పేజీలో..

# మందుబాబులకు షాక్

- జూన్ 2 తర్వాత మద్యం ధరల మోత
- తెలంగాణలో అన్ని రకాల లిక్కర్, బీర్లపై పెంపు సంకేతాలు
- 10–15 శాతం వరకు ధరలు పెంచే యోచనలో ప్రభుత్వం
- తయారీ వ్యయాల పెరుగుదలే ప్రధాన కారణమంటున్న సంస్థలు

**హైదరాబాద్, మే21 సిరి న్యూస్:** తెలంగాణలో మద్యం ధరలు పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాష్ట్ర అవతరణ దినోత్సవం అనంతరం అన్ని రకాల లిక్కర్, బీర్ల ధరలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం ప్రకటించే అవకాశముందని అధికార వర్గాల్లో చర్చ

మిగతా 3వ పేజీలో..





# ధరణి సమస్యలకు శాశ్వత పరిష్కారం

**మొదటిపేజీ తరువాయి**


ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు.
గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు, ధరణి వ్యవస్థలోని లోపాల కారణంగా రైతులు, పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి విమర్శించారు. ఈ సమస్యలకు పరిష్కారంగా రైతులకు అండగా నిలిచే భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. గతంలో భూ రికార్డులు కొందరి ఆధీనంలో ఉండేవని, ప్రస్తుతం పేదలకు భూములపై పూర్తి హక్కులు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.
జూన్ 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.సత్తుపల్లి పట్టణ పరిధిలోని 399 సర్వే నంబర్‌తో పాటు పరిసర గ్రామాల్లో ఉన్న దాదాపు 6,500 ఎకరాలకు సంబంధించిన భూ సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పెదపల్లి, నారాయణపురం ప్రాంతాల్లో 5,500 ఎకరాలకు పైగా ఉన్న భూములను క్షేత్రస్థాయిలో పూర్తిగా కొలిచి అర్హులైన రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందించాలని అధికారులను ఆదేశించారు.రుద్రాక్షపల్లి, కొకపాడు, తాళపెంట, రామచంద్రాపురం, వెంకటగిరి ప్రాంతాలతో పాటు సరిహద్దు గ్రామాల్లో కొనసాగుతున్న అటవీ, రెవెన్యూ భూముల వివాదాలను వర్షాకాలానికి ముందే పరిష్కరించాలని సూచించారు. సరిహద్దు గుర్తింపులు పూర్తి చేసి వివాదాలను శాశ్వతంగా ముగించాలని అధికారులకు స్పష్టం చేశారు. అటవీ భూములు మినహా మిగిలిన రెవెన్యూ భూములను తరతరాలుగా సాగు చేస్తున్న పేదలకు భూ పట్టాలు అందించే బాధ్యత తనదేనని మంత్రి భరోసా ఇచ్చారు. అనంతరం పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి ప్రాంతాల ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. రెవెన్యూ, గృహనిర్మాణం, అటవీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



# మహిళా సాధికారతకు రాష్ట్రవ్యాప్తంగా వారోత్సవాలు

**హైదరాబాద్, మే 21 సిరి న్యూస్:**

మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా వారోత్సవాలను నిర్వహించనుంది. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 25 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా వారంరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. గ్రామీణ మహిళలు, స్వయం సహాయక సంఘాలు, యువతులు, బాలికలు, దివ్యాంగులు, వృద్ధులు సహా అన్ని వర్గాల మహిళలను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయనున్నారు.
మహిళల ఆర్థిక స్వావలంబన, జీవనోపాధి అవకాశాల విస్తరణ, సామాజిక భద్రత, ఆరోగ్యం, భద్రత, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక సమావేశాలు, రుణమేళాలు, జీవనోపాధి యూనిట్ల ప్రారంభాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.
మే 29న హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక ఇంక్యుబేటర్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదే రోజు జీవనోపాధి యూనిట్లు, రుణమేళాలు కూడా నిర్వహించనున్నారు. కోళ్ల పెంపకం యూనిట్లు, సూక్ష్మ పరిశ్రమలు, వ్యవసాయ ప్రాసెసింగ్ కేంద్రాలు, తేనెటీగల పెంపకం కేంద్రాల వంటి పలు కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.
మహిళా సంఘాలను కేవలం పొదుపు సమూహాలుగా కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నడిపించే ఉత్పాదక శక్తులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. మహిళలకు బ్యాంకు రుణాలు, ఉపాధి అవకాశాలు, సూక్ష్మ పరిశ్రమలు, సౌర విద్యుత్ ప్రాజెక్టుల వంటి అవకాశాలను గ్రామస్థాయికే తీసుకెళ్తున్నామని తెలిపారు.
మే 25న సౌర విద్యుత్ ప్లాంట్ల ప్రారంభంతో పాటు మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడిచే 450 ఆర్టీసీ బస్సులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పోషకాహార అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. మే 26న సామాజిక సమీకరణ కార్యక్రమాలు, బాలికలతో మాదిరి శాసన సభ కార్యక్రమాలు చేపట్టనున్నారు.
మే 28న మహిళా సంఘ భవనాలు, గోదాములు, పనిశాలల నిర్మాణాలకు శంకుస్థాపనలు జరగనున్నాయి. మే 30, 31 తేదీల్లో మహిళల భద్రత, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహిళా సమాఖ్య భవనాల ప్రారంభం, బాలికలకు సైకిళ్ల పంపిణీ, ఆరోగ్య శిబిరాలు, మహిళల ఆరోగ్య పరీక్షలు కూడా చేపట్టనున్నారు.
రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాలను విజయవంతం చేయాలని మంత్రి సీతక్క అధికారులు, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు.




# విద్యుత్ శాఖలో నలుగురు నకిలీలు!

**మొదటిపేజీ తరువాయి**

దర్జాగా ప్రమోషన్!
2020లో జరిగిన జెఎల్ఎం నియామకాల్లో సంగారెడ్డి సర్కిల్ పరిధిలో 90 మంది నియామకం అయ్యారు . అందులో ఈ నలుగురు ఎంపికై, జహీరాబాద్ డివిజన్‌లో విధుల్లో చేరారు. సాధారణంగా నియామకం తర్వాత ధ్రువపత్రాల 'జెన్యూనిటీ' కోసం విద్యాసంస్థలకు పంపాలి. కానీ, అధికారులు ఉద్దేశపూర్వకంగానే ఆ ఫైళ్లను తొక్కేయడంతో, వీరు ఆరేళ్లుగా ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉద్యోగంలో కొనసాగారు. చివరకు 2024లో అసిస్టెంట్ లైన్‌మెన్లుగా పదోన్నతి కూడా పొందడం గమనార్హం.

**20 ఏళ్లుగా ఒకే సీటు..**

ఈ దొంగ సర్టిఫికెట్ల విషయాన్ని దాచేందుకు.. సర్కిల్ ఏడిఏం విభాగంలో పనిచేసే ఒక సీనియర్ అసిస్టెంట్ పెద్ద స్కెచ్ వేశాడు. దరఖాస్తులు వచ్చినట్లు, వెళ్లినట్లు ఆఫీస్ రికార్డుల్లో ఇన్వార్డ్, అవుట్‌వార్డ్ నంబర్లు వేయించి, ఆ ఫైళ్లను తన వద్దే దాచేశాడు. ఇందుకు గానూ ఆ నలుగురు నకిలీ సర్టిఫికెట్ల ఉద్యోగులనుండి నుండి రూ. 10 లక్షలు వసూలు చేసి, తన కుటుంబ సభ్యుల బ్యాంక్ అకౌంట్లలోకి వేయించుకున్నాడు. ఈ కిలాడీ అధికారి గత 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగి స్థాయి నుండి ఇక్కడే తిష్టవేసాడు.యూనియన్ నేతల అండ ఉండటంతో అయన కుంభకోణాల సామ్రాజ్యాన్ని నడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు అధికారికి సర్కిల్ పరిదిలో తోటి ఉద్యోగులెందరో బాధితులు ఉన్నారు. ఇక్కడ పైసలిస్తేనే ఫైల్ కదులుతుందని బోర్డు పెట్టకుండానే సందేశం ఇస్తాడట.ఆలా అంత నా ఇష్టమన్నట్టు ఆ అధికారి వ్యవహరించడం మూలంగానే ఇలా నలుగురు నకిలీలు ఆరేళ్లుగా ఉద్యోగులుగా చలామణి అయ్యారు.

**ఒక ఆర్టీసియన్ ఫిర్యాదుతో వెలుగులోకి..**

ఇటీవల నకిలీ సర్టిఫికెట్ల కారణంగా ఉద్యోగం కోల్పోయిన ఒక ఆర్టీసియన్.. 'నన్ను తీసేసి, నకిలీ సర్టిఫికెట్లతో ఉన్న ఆ నలుగురు జెఎల్ఎంలను ఎలా కొనసాగిస్తారు?' అంటూ ఉన్నతాధికారులకు తిరగబడి ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. నకిలీ సర్టిఫికేట్లతో ఉద్యోగం చేస్తున్న ఆ నలుగురి విషయంలో ఎవరి పాత్ర ఎంత అన్న విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు.నిజానికి 2020లోనే అధికారులు అప్రమత్తమై ఉంటే, అర్హులైన మరో నలుగురు నిజమైన నిరుద్యోగులకు ఆనాడు ఉద్యోగాలు లభించేవి. అధికారుల ఘోర నిర్లక్ష్యం వల్ల అర్హులైన అభ్యర్థుల జీవితాలు చీకట్లోకి నెట్టబడ్డాయి.

**క్రిమినల్ చర్యలకు సిఫార్సు!**

విజిలెన్స్ విచారణలో నిరూపణ కావడంతో తక్షణమే స్పందించిన ఉన్నతాధికారులు.. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం చేస్తున్న నలుగురు జెఎల్ఎంలను విధుల్లోంచి సస్పెండ్ చేశారు. వీరికి సహకరించిన సీనియర్ అసిస్టెంట్‌పై కూడా వేటు వేశారు. ఒక్కొక్కరి నుండి రూ. 5 లక్షలు వసూలు చేసి, మేనేజ్ చేసిన ఇద్దరు యూనియన్ ప్రతినిధులు, సబ్ ఇంజనీర్ పాత్రపై కూడా ప్రస్తుతం లోతుగా విచారణ సాగుతోంది. నకిలీలని తెలిసి కూడా ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసిన సదరు ఉద్యోగులతో పాటు, వీరికి సహకరించిన అధికారులు, యూనియన్ నేతలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విజిలెన్స్ బృందం సిఫార్సు చేసింది.

**ఉన్నతాధికారుల వైఫల్యం !**

ఆరేళ్లుగా ముగ్గురు సూపరిండెంట్ ఇంజినీర్లు మారారు.కానీ ఒక్క అధికారి సైతం ఈ నలుగురి నకిలీ వ్యవహారాన్ని కనుక్కోలేకపోయారు. 2020 నుండి ముగ్గురు ఎస్ఈ లు మారినా నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగులోకి రాలేదంటే ఆ సీనియర్ అసిస్టెంట్ ఎంత ప్రభావం చేసాడో అర్థం చేసుకోవచ్చు. కానీ జిల్లా స్థాయి అధికారికి 90 మందిలో ఆ నలుగురివి మాత్రమే జన్యూనిటీ రాలేదన్న విషయం తెలియకపోవడం ఏంటన్నది ఒక ప్రశ్న. ఏది ఏమైనా సంగారెడ్డి విద్యుత్ సర్కిల్ ఏడిఏం లో ఇంకెన్ని కుంభకోణాలు జరిగాయో అన్న కోణంలో అధికారులు విచారణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఎన్నాళ్లు మొద్దునిద్ర.. రైతులపై దృష్టి పెట్టండి

**హైదరాబాద్, మే 21 సిరి న్యూస్:**

రాష్ట్రంలో పంట కొనుగోళ్ల వ్యవస్థ పూర్తిగా సంక్షోభంలోకి వెళ్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంకా ఎంతకాలం మొద్దునిద్ర పోతారని ప్రశ్నిస్తూ ఆయన బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈ నెల 23న జరగనున్న కేబినెట్ సమావేశంలోనైనా ప్రభుత్వం రైతు సమస్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.
కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రోజుల తరబడి ధాన్యంతో వేచి ఉండాల్సి వస్తోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మండుతున్న ఎండల్లో, వడదెబ్బల మధ్య రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలపై చూపుతున్న శ్రద్ధలో కొంతైనా రైతుల సమస్యలపై చూపించాలని విమర్శించారు.
కొనుగోలు ప్రక్రియలో ఆలస్యాల కారణంగా ఇప్పటివరకు దాదాపు 10 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. వరంగల్ నుంచి ఖమ్మం వరకు అనేక ప్రాంతాల్లో ధాన్యం లారీల ఎత్తివేత సరిగా జరగడం లేదన్నారు. కొనే చోట్ల కూడా క్వింటాలుకు 10 కిలోల వరకు తరుగు తీస్తూ రైతులను నష్టపరుస్తున్నారని ఆరోపించారు. గన్నీ బ్యాగుల కోసం రైతుల నుంచే డిపాజిట్ వసూలు చేయడం దారుణమన్నారు.
బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ముందస్తు ప్రణాళికలతో రైతులకు భరోసా కల్పించారని కేటీఆర్ గుర్తుచేశారు. కరోనా సమయంలో కూడా రైతుల వద్దకే వెళ్లి చివరి గింజ వరకు కొనుగోలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. కానీ ప్రస్తుతం అకాల వర్షాల సమయంలో పంటను రక్షించేందుకు అవసరమైన టార్పాలిన్లు కూడా ప్రభుత్వం అందించలేకపోతోందని మండిపడ్డారు.
అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన బోనస్ హామీ అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదని కేటీఆర్ విమర్శించారు. కనీసం మద్దతు ధరకు కొనుగోళ్లు కూడా చేయలేకపోతే ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద మరణించిన రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు.
రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఆందోళనలు పెరుగుతున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులే గట్టి సమాధానం చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు. రైతు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

# తెలంగాణకు కేంద్రం మరో బంపర్ గిఫ్ట్..

**మొదటిపేజీ తరువాయి**

రూ. 5,818.45 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టును పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం (PPP - Public Private Partnership) పద్ధతిలో చేపట్టనున్నారు. ఈ కొత్త లైన్ అందుబాటులోకి వస్తే తెలంగాణలోని మారుమూల గిరిజన ప్రాంతాలకు రైల్వే సౌకర్యం దక్కడంతో పాటు, ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకు పెద్ద ఉపశమనం లభించనుంది. మొత్తం 207.8 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న ఈ సరికొత్త రైల్వే లైన్ మంథని, భూపాలపల్లి, తాడ్వాయి, గోపాలరావుపేటలతో పాటు ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం మీదుగా వెళ్లనుంది. ప్రస్తుతం మణుగూరు నుండి రామగుండం వెళ్లాలంటే భద్రాచలం రోడ్ (కొత్తగూడెం), కాజీపేట మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. కానీ, ఈ కొత్త లైన్ పూర్తయితే మణుగూరురామగుండం మధ్య



ఏకంగా 90 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. దీనివల్ల ప్రయాణికులకు సమయం, డబ్బు భారీగా ఆదా అవుతాయి. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరతో పాటు, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వెళ్లే భక్తులకు కనెక్టివిటీ మరింత సులభతరం కానుంది. ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా ములుగు, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వెనుకబడిన మారుమూల గిరిజన ప్రాంతాలకు ఒక పెద్ద వరంగా మారబోతోంది. దశాబ్దాలుగా రైలు ముఖం చూడని ఎన్నో గ్రామాలకు ఈ లైన్ ద్వారా రైల్వే కనెక్టివిటీ లభిస్తుంది. కేవలం ప్రయాణికులకు మాత్రమే కాకుండా, ఈ ప్రాంతంలో లభించే బొగ్గు (Coal), ఖనిజాలు, ఎరువులు , ఇతర పారిశ్రామిక సరుకు రవాణాకు (Freight Transport) ఈ రైల్వే లైన్ అత్యంత కీలకంగా మారనుంది. దీనివల్ల సింగరేణి బొగ్గు గనుల రవాణా మరింత వేగవంతం కానుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసేందుకు రైల్వే శాఖ సరికొత్త ప్లాన్ సిద్ధం చేసింది. డీపీఆర్ (DPR) తయారీ, ల్యాండ్ అక్విజిషన్ (భూసేకరణ), వివిధ ప్రభుత్వ శాఖల నుండి అనుమతులు తీసుకునే బాధ్యతలను రైల్వే శాఖ చూసుకుంటుంది. అయితే, ప్రాజెక్ట్ నిర్మాణం , నిధుల సమీకరణ పనులను ప్రైవేట్ భాగస్వామ్య సంస్థకు అప్పగిస్తారు. దీనికోసం రైల్వే శాఖ త్వరలోనే టెండర్లను ఆహ్వానించనుంది. ఈ ప్రాజెక్ట్ టైమ్‌లైన్ ప్రకారం.. మొదటి ఏడాదిలో పూర్తిగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి, ఆ తర్వాత నాలుగు సంవత్సరాలలో అంటే మొత్తం ఐదేళ్ల వ్యవధిలో ఈ కొత్త రైల్వే లైన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# వైభవంగా సరస్వతి నది అంత్య పుష్కరాలు షురూ

**జయశంకర్ భూపాలపల్లి, మే 21 సిరి న్యూస్:**

కాళేశ్వరం త్రివేణి సంగమం వేద మంత్రోచ్ఛారణలతో మారుమోగింది. దక్షిణాది రాష్ట్రాల్లోనే ఏకైక క్షేత్రం అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి సంగమంలో గురువారం ఉదయం 5.43 నిమిషాలకు పుష్కరాలు లాంఛనంగా ప్రారంభం అయ్యాయి. గురువారం వేకువ జామునే త్రివేణి సంగమ తీరాన సరస్వతి నదికి పుష్కరుడిని ఆహ్వానించే కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. త్రివేణి సంగమ క్షేత్రం, త్రిలింగ క్షేత్రం అయిన కాళేశ్వరం అత్యంత అరుదైన ఘట్టానికి వేదికగా నిలిచింది. ఇప్పటివరకూ సాంప్రదాయానికే పరిమితమైన సరస్వతి అంత్య పుష్కరాలు ఈసారి అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది.

**గణపతి పూజతో..**

గోదావరి, ప్రాణహిత నదులు కలిసినచోట అంతర్వాహినిగా సరస్వతి నది ఉద్భవించిన ప్రాంతంలో ఉదయం 5.43 గంటలకు సరస్వతి పుష్కరాలు ప్రారంభం అయ్యాయి. గోదావరి పుష్కరాల సమయంలో (వీఐపీ ఘాట్) సరస్వతి ఘాట్‌లో సరస్వతి నది పుష్కరాలను నిర్వహిస్తున్నారు. కంచి స్వామితోపాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ఆయన సతీమణి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హై కోర్టు న్యాయమూర్తి నందా, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, భూపాలపల్లి,



రంగారెడ్డి ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి, ట్రేడింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, ఇతర ప్రముఖులు త్రివేణి సంగమ క్షేత్రంలో సరస్వతి అంత్య పుష్కర వేడుక ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై పుణ్య స్నానాలాచరించారు. తొలుత విఘ్నాధిపతి అయిన విఘ్నేశ్వరునికి తొలి పూజలు చేసిన తరువాత అంత్య పుష్కర మహోత్సవ వేడుకలకు అంకురార్పరణ చేశారు.

**కంచి పీఠాధిపతిచే..**

అత్యంత అరుదైన సరస్వతి పుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరించారు. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పుష్కర స్నానాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వేద పండితులు సరస్వతి నదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ కాళేశ్వర మక్తీశ్వర స్వామిని, శ్రీ శుభానంద దేవిని, సరస్వతి మాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పుష్కరాలు నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్, ఎస్పీ నేతృత్వంలోని జిల్లా యంత్రాంగం కొన్నిరోజులుగా అవిశ్రాంతంగా శ్రమించి భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పుష్కర స్నానాలు ఆచరించి చదువుల తల్లి సరస్వతి మాత అశీస్సులు పొందాలని ఆయన ఆకాంక్షించారు.

**అన్ని ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం**

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. భద్రత, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, రవాణా వంటి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ పుణ్యకాలంలో భక్తులు సౌకర్యవంతంగా, సురక్షితంగా పుష్కర స్నానాలు నిర్వహించుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ అంత్య పుష్కరాలు పన్నెండు రోజులపాటు కొనసాగుతాయి. ఆచరించిపుష్కరాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. పుణ్య స్నానాలు ఆచరించి శ్రీ కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించే భక్తుల కోసం ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పలు ధార్మిక సంఘాలు ఉచిత అన్నప్రసాద వితరణ చేస్తున్నాయి, చలువ పందిళ్లు ఏర్పాటు చేసి ఎండ తీవ్రతనుంచి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నారు.

**ఆలయ విశిష్టతలు**

భారత దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒకే పానవట్టంపై యముడు (కాళేశ్వరుడు) శివుడు (ముక్తేశ్వరుడు) కొలువై ఉండడం ఈ ఆలయ ప్రత్యేకత. ఇక్కడ కాళేశ్వరునికి పూజలు చేసిన తర్వాతే ముక్తేశ్వరునికి పూజలు చేయడం ఆనవాయితీ. ముక్తేశ్వర లింగం పైభాగంలో రెండు చిన్న రంధ్రాలు ఉంటాయి. ఎంత నీటితో అభిషేకం చేసినా ఆ నీరు అందులోనే ఇంకిపోవడం ఒక అద్భుతం. భక్తులు తమ పాపాలు తొలగిపోవడానికి, మృత్యు భయం తొలగిపోవడానికి ఆలయంలోని 'యమకోణం' (ఒక చిన్న సందు) గుండా వెళ్లడం ఒక ముఖ్యమైన ఆచారం.

## రేవంత్ అబద్ధం చెప్పారా..? బండి సంజయ్ అబద్ధం చెప్పారా..?

**హైదరాబాద్, మే 21 సిరి న్యూస్:**

పోక్సో కేసు నిందితుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ అరెస్ట్ వ్యవహారం రాజకీయంగా దుమారం రేపుతోంది. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయని బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. "అసలు జరిగింది పోలీసుల అరెస్టా..? లేక లాయర్ల సమక్షంలో జరిగిన సరెండరా..?" అని ప్రశ్నించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధం చెబుతున్నారా..? లేక కేంద్ర మంత్రి బండి సంజయ్ అబద్ధం చెబుతున్నారా..? అని నిలదీశారు.

"ఈరోజు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు మధ్యలో నాకాబందీ నిర్వహించి బండి భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారని, ఇందులో రాజకీయ కోణం లేదని చెప్పారు. పోలీసుల మాట నమ్మాలని పేర్కొన్నారు" అని ప్రవీణ్‌కుమార్ గుర్తుచేశారు. అదే సమయంలో బండి సంజయ్ మాత్రం భిన్నంగా స్పందించారని తెలిపారు. "నేను బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రిగా, రాజకీయ నాయకుడిగా నా కొడుకును నా లాయర్ల ద్వారా పోలీసులకు సరెండర్ చేశాను" అని బండి సంజయ్ స్పష్టంగా ప్రకటించారని చెప్పారు.

ఈ నేపథ్యంలో "మనం రాష్ట్ర ముఖ్యమంత్రిని నమ్మాలా..? లేక దేశ హోంశాఖ సహాయ మంత్రిని నమ్మాలా..?" అని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు.



## మందుబాబులకు షాక్

**మొదటిపేజీ తరువాయి**

జరుగుతోంది. అదనపు ఆదాయ వనరులను సమకూర్చుకోవడంతో పాటు తయారీ సంస్థల నుంచి వస్తున్న ఒత్తిళ్ల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకునే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

మద్యం తయారీ సంస్థలు గత కొంతకాలంగా ధరల సవరణ కోరుతున్నాయి. ముడిసరుకుల ధరలు పెరగడం, గాజు సీసాల తయారీ వ్యయం అధికమవడం, కమర్షియల్ గ్యాస్ ధరలు పెరగడం వల్ల తయారీ ఖర్చులు గణనీయంగా పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో మొత్తం ఉత్పత్తి వ్యయం 15 నుంచి 20 శాతం వరకు పెరిగిందని వెల్లడిస్తున్నాయి.

మద్యం ధరల పెంపుపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ ఇప్పటికే నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులతో పాటు పొరుగు రాష్ట్రాల్లో అమలవుతున్న ధరలను పరిశీలించిన కమిటీ 25 నుంచి 30 శాతం వరకు పెంపు సాధ్యమని సూచించినట్లు సమాచారం. అయితే ఒకేసారి భారీగా ధరలు పెంచితే ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ప్రస్తుతం 10 నుంచి 15 శాతం వరకు మాత్రమే పెంపు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే సాధారణ బ్రాండ్ల నుంచి ప్రీమియం బ్రాండ్ల వరకు అన్ని రకాల మద్యం, బీర్ల ధరలు పెరగనున్నాయి. ధరల పెంపుతో ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూరనుండగా, వినియోగదారులపై అదనపు భారం పడనుంది. దీనికి సంబంధించిన ప్రక్రియను ఆర్థిక, అబ్కారీ శాఖలు ఇప్పటికే పూర్తి చేసినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ..

**సిరిన్యూస్‌టుడే**

ఝార్ఖండ్‌లో మావోయిస్టు ఉద్యమానికి కోలుకోలేని మరో దెబ్బ తగిలింది. 25 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా పోలీసుల ఎదుట లొంగిపోయారు. రాష్ట్ర డీజీపీ సమక్షంలో వీరు జనజీవన స్రవంతిలో కలిసిపోయారు. లొంగిపోయిన వారిలో ఆరుగురు సబ్ జోనల్ కమాండర్లు, మరో ఆరుగురు ఏరియా కమాండర్లు, 13 మంది చురుకైన హార్డ్‌కోర్ సభ్యులు ఉన్నారు. వీరంతా సుదీర్ఘకాలంగా ఝార్ఖండ్‌లోని అత్యంత క్లిష్టమైన కోలహాన్, దట్టమైన సరంద అటవీ ప్రాంతాలలో తమ సాయుధ కార్యకలాపాలను నిర్వహిస్తూ భద్రతా దళాలకు సవాలుగా మారారు.

ఈ లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు భారీగా ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఇందులో ఎల్ఎమ్‌జీ, ఇన్సాస్ రైఫిళ్లు, ఎస్ఎల్ఆర్ లు, 303 రైఫిళ్లు, దేశవాళీ తుపాకులు ఉన్నాయి. లొంగిపోయిన వారిలో మహిళా మావోయిస్టులు కూడా ఉండటం గమనార్హం. 100కు పైగా తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉండి, సుదీర్ఘకాలంగా మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న టాప్ కమాండర్ సాగెన్ అంగారియా అలియాస్ డొకోల్ కూడా లొంగిపోయిన వారిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇంతటి కీలక నేతలు, కేడర్ ఒకేసారి ప్రధాన స్రవంతిలోకి రావడంతో ఝార్ఖండ్‌లో మావోయిస్టు పార్టీ నెట్‌వర్క్ పూర్తిగా బలహీనపడినట్లయింది.

ఈ సందర్భంగా ఝార్ఖండ్ డీజీపీ మాట్లాడుతూ... రాష్ట్రంలో తీవ్రవాదాన్ని, నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు భద్రతా దళాలు సమష్టిగా, వ్యూహాత్మకంగా పనిచేస్తున్నాయని కొనియాడారు. హింసను వీడి వచ్చిన వీరందరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో పునరావాసం కల్పిస్తామని, సమాజంలో గౌరవప్రదంగా బతికేందుకు తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ఇంకా అడవుల్లో అజ్ఞాతంలో కొనసాగుతున్న మిగిలిన మావోయిస్టులు కూడా తక్షణమే హింసా మార్గాన్ని విడనాడి, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వాడుకుంటూ ప్రధాన స్రవంతిలోకి రావాలని సీఆర్పీఎఫ్ ఐజీ సాకేత్ సింగ్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



# ఫిట్‌నెస్ ఉంటేనే బస్సు కదులుద్ది!

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల పునః ప్రారంభానికి ముందే రవాణా శాఖ అత్యంత అప్రమత్తమైంది. ఏటా స్కూళ్లు, కాలేజీలు తెరిచిన తర్వాత ప్రమాదాలు జరగడం, ఆపై తనిఖీలు చేపట్టడం పరిపాటిగా మారిన తరుణంలో.. ఈసారి ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలపై గట్టిగా దృష్టి సారించింది. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కావడానికి మరో పక్షం రోజుల గడువు ఉండగానే విద్యావాహనాల ఫిట్‌నెస్‌పై రవాణా శాఖ ప్రత్యేక డ్రైవ్‌కు శ్రీకారం చుట్టింది. విద్యార్థుల రవాణా వ్యవస్థలో ఎలాంటి లోపాలు, ప్రమాదాలకు తావుండకూడదన్న ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా.. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీల యాజమాన్యాలకు రవాణా నిబంధనలు ఖచ్చితంగా పాటించాలంటూ ఇప్పటికే అధికారికంగా నోటీసులు జారీ చేసింది.

**గ్రేటర్ పరిధిలోనే 20 వేల బస్సులు..**

తెలంగాణవ్యాప్తంగా దాదాపు 32 వేల ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు ఉండగా.. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే 20 వేలకు పైగా బస్సులు విద్యార్థులను తరలించడానికి సిద్ధమవుతున్నాయి. ఇవి కాకుండా వేలాది సంఖ్యలో ఆటోలు, మినీ వ్యాన్లు కూడా నడుస్తున్నాయి. ప్రస్తుతం రవాణా శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఈ అన్ని వాహనాల వివరాలను సేకరిస్తున్నారు. వాహనం తయారీ తేదీ, ఫిట్‌నెస్ పరిస్థితి, ఇన్సూరెన్స్ తదితర వివరాలను అందించాలని ప్రైవేట్ విద్యాసంస్థలను ఆదేశించింది. నిబంధనలు పాటించని, ఫిట్‌నెస్ లేని వాహనాలను విద్యాసంస్థలు ప్రారంభమయ్యే నాటికి ముందస్తుగానే సీజ్ చేసేందుకు రవాణా శాఖ కార్యాచరణ సిద్ధం చేసింది.

**ప్రత్యేక తనిఖీల్లో పరిశీలించే అంశాలు ఇవే..**

డ్రైవర్ల నిర్లక్ష్యం, వాహనాల్లోని సాంకేతిక లోపాల కారణంగా ఏటా వందలాది మంది విద్యార్థులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. మరికొందరు శాశ్వత వైకల్యం పొంది జీవితాలను కోల్పోతున్నారు. ఈ ఘోరాలను అరికట్టడమే లక్ష్యంగా రవాణా శాఖ రంగంలోకి దిగింది. ప్రత్యేక తనిఖీల్లో భాగంగా అధికారులు ప్రధానంగా ఈ క్రింది అంశాలపై సంపూర్ణ సమాచారాన్ని సేకరిస్తున్నారు.

డాక్యుమెంట్ల పరిశీలన.. వాహనానికి చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ ఉన్నాయా లేదా?

డ్రైవర్ల ట్రాక్ రికార్డు.. డ్రైవర్లకు చెల్లుబాటు అయ్యే హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు తగిన అనుభవం ఉందా?

భద్రతా సౌకర్యాలు.. బస్సుల్లో అత్యవసర సమయాల్లో ఉపయోగపడే ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్టింగ్విషర్ (అగ్నిమాపక పరికరం), ఎమర్జెన్సీ ఎగ్జిట్ సక్రమంగా పనిచేస్తున్నాయా? యాంత్రిక ఫిట్‌నెస్.. వాహనాల బ్రేకులు, టైర్లు, ఇండికేటర్లు, హెడ్‌లైట్లు మరియు ఇతర యాంత్రిక భాగాలు సక్రమంగా ఉన్నాయా? స్టాఫ్ పర్యవేక్షణ.. విద్యార్థుల భద్రతను పర్యవేక్షించేందుకు బస్సులో ప్రత్యేకంగా అటెండర్‌ను నియమించారా లేదా? ఈ నిబంధనల్లో ఏ ఒక్కటి ఉల్లంఘించినా మోటార్ వాహన చట్టం ప్రకారం వాహనాలను వెంటనే సీజ్ చేయడంతో పాటు, డ్రైవర్లు మరియు సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.

**యాజమాన్యాలదే పూర్తి బాధ్యత**

విద్యాసంస్థల విద్యార్థులను రవాణా చేసే వాహనాల నిర్వహణ, భద్రతా ప్రమాణాల అమలు, నిబంధనల పాటింపు యొక్క పూర్తి బాధ్యత సంబంధిత పాఠశాల, కళాశాల యాజమాన్యాలదేనని రవాణా శాఖ స్పష్టం చేసింది. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని, స్కూల్ యాజమాన్యాలే చట్టానికి సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అందువల్ల యాజమాన్యాలు తమ వాహనాలను క్రమం తప్పకుండా ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరు పరిచి, సర్టిఫికేట్లు పొందాలని సూచించింది.

**తల్లిదండ్రులకు కీలక విజ్ఞప్తి**

ఇదే సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా రవాణా శాఖ ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేసింది. కేవలం తక్కువ ఖర్చు వస్తుందనో, సౌకర్యంగా ఉంటుందనో అధిక సంఖ్యలో విద్యార్థులను కుక్కి కుక్కి ఎక్కించుకునే ఆటోలు, వ్యాన్లలో తమ పిల్లలను పంపవద్దని సూచించింది. ఒకవేళ రవాణా శాఖ తనిఖీలలో ఫిట్‌నెస్ లేని లేదా ఓవర్‌లోడ్ చేస్తున్న వాహనాలను సీజ్ చేస్తే.. విద్యార్థులు మధ్యలోనే రోడ్లపై ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అందువల్ల, తల్లిదండ్రులు సైతం తమ పిల్లలు ప్రయాణించే వాహనాల ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలు, అనుమతులపై ముందుగానే స్కూల్ యాజమాన్యాలను అడిగి నిర్ధారించుకోవాలని, పిల్లల సురక్షిత ప్రయాణానికి భాగస్వాములు కావాలని కోరింది.

# కులగణనలో తెలంగాణ దేశానికి దిక్సూచి

- **సుప్రీంకోర్టు నిర్ణయంపై హర్షం**
- **కేంద్రానికి ముఖ్యమంత్రి కీలక డిమాండ్**
- **తెలంగాణ నిర్ణయానికి గౌరవమన్న వ్యాఖ్యలు**

**హైదరాబాద్, మే 21 సిరి న్యూస్:**



జనగణనలో కులగణన అంశాన్ని చేర్చడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి దశ, దిశ చూపించిన రాష్ట్రంగా నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జనాభా లెక్కల్లో కులగణన అంశాన్ని సుప్రీంకోర్టు సమర్థించడం స్వాగతించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి మరింత బలం చేకూరిందని అభిప్రాయపడ్డారు.

సుప్రీంకోర్టు నిర్ణయం వెలువడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే దేశవ్యాప్తంగా కులగణనను అమలు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కులగణన చేపట్టి సమగ్ర సమాచారాన్ని సేకరించిందని గుర్తుచేశారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలకు సంబంధించిన సమగ్ర కుల సర్వేను నిర్వహించి వివరాలను ప్రజల ముందుంచామని ముఖ్యమంత్రి తెలిపారు. బలహీన వర్గాల్లో నెలకొన్న అభద్రతా భావాన్ని తొలగించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు.

కులగణన అంశాన్ని సుప్రీంకోర్టు సమర్థించడం మంచి పరిణామమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. తెలంగాణ తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం పరోక్షంగా సమర్థించడం రాష్ట్రానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యకు తెలంగాణ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించే ప్రయత్నం చేసిందని ముఖ్యమంత్రి అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం చేసే విధంగా రాష్ట్రం ముందడుగు వేసిందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కూడా ఇలాంటి చర్యలు చేపడితే బలహీన వర్గాల అభివృద్ధికి మరింత తోడ్పాటు అందుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. సమగ్ర సమాచారంతో సంక్షేమ విధానాలు మరింత సమర్థవంతంగా అమలు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

# కేంద్ర అధికారుల పర్యటనలతో రాష్ట్ర శాఖలకు కొత్త తలనొప్పి

- **అధిక సదుపాయాల డిమాండ్లతో అధికారుల్లో ఆందోళన**
- **బడ్జెట్‌కు మించిన ఖర్చులతో శాఖలపై అదనపు భారం**
- **నిధుల ప్రభావం భయంతో ఇబ్బందులు భరిస్తున్న అధికార యంత్రాంగం**

**హైదరాబాద్ సిరి న్యూస్:**

కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల రాష్ట్ర పర్యటనలు కొన్ని శాఖల అధికారులకు సవాలుగా మారుతున్నాయనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో సాగుతోంది. కేంద్ర నిధులతో అమలవుతున్న పథకాల సమీక్షలు, సమావేశాలు, తనిఖీల కోసం వచ్చే కొందరు అధికారులు ప్రోటోకాల్‌కు మించి సౌకర్యాలు కోరుతున్నారని, దీంతో రాష్ట్ర ప్రభుత్వ శాఖలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సమాచారం.

కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు, అదనపు కార్యదర్శులు రాష్ట్రానికి వచ్చినప్పుడు వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రత్యేక మర్యాదలు, వసతి, భద్రతా ఏర్పాట్లు కల్పించడం ఆనవాయితీ. ఇతర స్థాయి అధికారులు వచ్చినప్పుడు సంబంధిత శాఖలే తమ బడ్జెట్ పరిధిలో వసతి, రవాణా, ఇతర అవసరాలను సమకూరుస్తుంటాయి. అయితే ఇటీవల కొందరు అధికారులు విలాసవంతమైన హోటళ్లలో బస, ప్రత్యేక సూట్ గదులు, ఖరీదైన వాహనాలు వంటి సౌకర్యాలను కోరుతున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రముఖ హోటళ్ల నుంచి ప్రత్యేక భోజన ఏర్పాట్లు చేయాలని, పర్యటనల సమయంలో ఉన్నత స్థాయి వాహనాలను అందుబాటులో ఉంచాలని సూచిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పరిమిత బడ్జెట్‌తో పనిచేసే శాఖలు అదనపు వ్యయాన్ని భరించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

ఇటీవల నిర్వహించిన కొన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో కేంద్ర అధికారుల ప్రవర్తన కూడా చర్చనీయాంశంగా మారినట్లు సమాచారం. సత్కార కార్యక్రమాల్లో అందించిన బహుమతుల విషయంలోనూ, వాహనాల ఎంపికలోనూ కొందరు అధికారులు ప్రత్యేక అభిరుచులు వ్యక్తం చేయడంతో స్థానిక అధికారులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెబుతున్నారు. ముందుగా ఏర్పాటు చేసిన వాహనాలను తిరస్కరించి మరింత ఖరీదైన వాహనాలు కోరిన సందర్భాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

కేంద్ర నిధులపై ఆధారపడే శాఖలు ఇలాంటి అంశాల్లో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సి వస్తోందని అధికార వర్గాలు అంటున్నాయి. సంబంధాలు దెబ్బతినకూడదనే ఉద్దేశంతో చాలాసార్లు అదనపు ఖర్చులు భరించక తప్పడం లేదని చెబుతున్నారు. ముఖ్యంగా చిన్న బడ్జెట్‌తో పనిచేసే శాఖలకు ఇది మరింత భారంగా మారుతోందని పేర్కొంటున్నారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అభివృద్ధి కార్యక్రమాల విజయానికి కీలకమైనప్పటికీ, పర్యటనల సందర్భంగా ప్రోటోకాల్‌కు మించిన సదుపాయాల డిమాండ్లు పెరగడం రాష్ట్ర శాఖలపై ఆర్థిక, పరిపాలనా ఒత్తిడిని పెంచుతున్నట్లు అధికార వర్గాలు భావిస్తున్నాయి.





# మహిళా రైతులకు మార్కెట్ అవకాశాలు

- **పేదరికం నుంచి ప్రగతి దిశగా అడుగులు**
- **మధ్య దళారులకు చెక్ పెడుతున్న సెర్ప్**
- **అంతర్జాతీయ మార్కెట్లతో రైతుల అనుసంధానం**
- **మంత్రి సీతక్క**

**హైదరాబాద్, మే 21 సిరి న్యూస్:**

గ్రామీణ పేదరిక నిర్మూలనతో పాటు మహిళా రైతుల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా సెర్ప్ సంస్థ వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆలోచనలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న, సన్నకారు రైతులకు కొత్త అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపడుతోంది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతుల ఆదాయం పెంచడమే ప్రధాన లక్ష్యంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రైతులు పండించిన పంటలను మధ్యవర్తులు లేకుండా నేరుగా మార్కెట్‌కు అనుసంధానం చేసే వ్యవస్థను సెర్ప్ ఏర్పాటు చేసింది. ఆన్‌లైన్ విక్రయ వేదికలు, ఆధునిక వ్యాపార సంస్థలు, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లతో రైతులను అనుసంధానం చేస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ చూపిస్తోంది. సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటైన "బేనిశాన్" రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య రాష్ట్రంలోని మామిడి రైతులకు కొత్త అవకాశాలను తెరిచింది. వనపర్తి జిల్లా పెబ్బేరు గ్రామానికి చెందిన రైతు బాలకృష్ణ దంపతులు ఈ సీజన్‌లో మల్లిక రకం మామిడి పండ్లను విదేశాలకు ఎగుమతి చేయడం విశేషంగా నిలిచింది. ఈ విధానంతో చిన్న రైతుల్లో కూడా ఆశలు పెరిగినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఈ వ్యవస్థ ద్వారా రైతులకు అదనంగా పదిహేను నుంచి ఇరవై శాతం వరకు అధిక ఆదాయం లభిస్తున్నట్లు సమాచారం. సమీకరణ, గ్రేడింగ్, ప్యాకింగ్, రవాణా వంటి సదుపాయాల కారణంగా చిన్న రైతులు కూడా పెద్ద మార్కెట్లలోకి ప్రవేశించే అవకాశం పొందుతున్నారు. రిలయన్స్, ఫ్లిప్‌కార్ట్, బిగ్ బాస్కెట్, మెట్రో, రత్నదీప్ వంటి ఆధునిక విక్రయ సంస్థలతో పాటు పలు వ్యవసాయ ప్రాసెసింగ్ సంస్థలతో బేనిశాన్ ఒప్పందాలు కుదుర్చుకుంది. గతంలో తక్కువ ఉత్పత్తి కారణంగా మార్కెట్ అవకాశాలు కోల్పోయిన రైతులు ఇప్పుడు గిట్టుబాటు ధరలు పొందుతున్నారని అధికారులు తెలిపారు. ప్రస్తుతం బేనిశాన్ సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎనభై నాలుగు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. లక్షకు పైగా చిన్న, సన్నకారు రైతులు ఇందులో సభ్యులుగా ఉన్నారు. మహిళా రైతులను ఆర్థికంగా బలోపేతం చేస్తూ గ్రామీణాభివృద్ధికి ఈ కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.

## అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**ఎమ్మెల్యే జీఎంఆర్**



**రామచంద్రపురం, మే 21, (సిరి న్యూస్):**

"ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం. ప్రతి కాలనీలో అభివృద్ధి పనులు చేపడుతూ ముందుకు సాగుతున్నాం" అని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం ముత్తంగి డివిజన్ పరిధిలోని వెలిమలలో రూ.45 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాంతీయ అభివృద్ధిలో భాగంగా రహదారులు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, డీఈ కృష్ణవేణి, మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన చైర్మన్ మహమ్మద్ గౌసోద్దీన్



**ఝరాసంఘం,మే 21 (సిరిన్యూస్)**

మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పిఏసిఎస్ చైర్మన్ మొహమ్మద్ గౌసోద్దీన్ ప్రారంభించారు .ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూపాయలు 3699 పొందాలని,మార్కెట్లో జొన్నలకు తక్కువ ధరలు ఉండటంతో రైతులు నష్టపోకుండా,దళారుల చేతుల్లో ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతుల ప్రయోజనాల కోసమే ఈ కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు.రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని. చైర్మన్ కోరారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ పి. సంజీవరెడ్డి, సొసైటీ డైరెక్టర్, కృష్ణ, సుబాష్, మారుతీ రావు పటేల్, సర్పంచ్ మల్లారెడ్డి, టెంపుల్ డైరెక్టర్ జి. మల్లికార్జున్ పటేల్ , మల్లన్న మరియు సీఈఓ సుకుమార్ సొసైటె సెక్రటరీ షేక్ నిస్సార్ అహ్మద్ సంఘ సిబ్బంది, రైతులు, టి. రాజెందర్ సింగ్, రాంరెడ్డి బషీరెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రవీణ్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వద్దు

**క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి కొనుగోళ్లు చేయాలి**

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**హత్నూర డీసీఓ, ఎంపీడీవో, ఏపీఎంలకు షోకాజ్ నోటీసులు**

**మూడు రోజుల్లోగా రాతపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశం**

**హత్నూర, సిరి న్యూస్:**

హత్నూర మండలంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చోటుచేసుకున్న నిర్లక్ష్యం, అధికారుల మధ్య సమన్వయ లోపాలు, పర్యవేక్షణ వైఫల్యాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద సరైన ఏర్పాట్లు లేక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. జిల్లా సహకార అధికారి కిరణ్ కుమార్, హత్నూర ఎంపీడీవో బి. శంకర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజశేఖర్‌లకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లోగా తమ వివరణ సమర్పించాలని వారిని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై గతంలో పలుమార్లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ అధికారుల తీరులో మార్పు రాకపోవడం దురదృష్టకరమన్నారు. ఫీల్డ్ స్థాయిలో సమర్థవంతమైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని మండిపడ్డారు. అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ధాన్యం సేకరించాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధుల్లో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని, ప్రతి గింజా కొనుగోలు చేసే వరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ గట్టిగా హెచ్చరించారు.

## 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' విజయవంతం చేయాలి

**అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి**

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, సిరి న్యూస్:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నేడు నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమ ఏర్పాట్లపై గురువారం సంబంధిత శాఖల అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ఇప్పటికే ప్రజా పాలన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని కూడా నిర్వహించాలని తెలిపారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలు, ప్రభుత్వం కేటాయించిన నిధులు, జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరు, సాధించిన పురోగతిని ప్రజలకు వివరించేలా సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా శాఖలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో సమాచారాన్ని సిద్ధం చేయాలని సూచించారు. శాఖల వారీగా అధికారులు సమన్వయంతో బాధ్యతలు నిర్వర్తించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, రెవెన్యూ అధికారులు తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# గణేష్ గడ్డ అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష..

- **రహదారి పనులతో భక్తులకు అసౌకర్యం కలగొద్దని సూచన**

**రామచంద్రపురం,(పటాన్చెరు), మే 21, (సిరి న్యూస్):**



జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా గణేష్ గడ్డ శ్రీ సిద్ధి వినాయక గణపతి దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు.గురువారం ఉదయం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం వద్ద గల గణేష్ గడ్డ దేవాలయం సమీపంలో జరుగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు పొందిన గణేష్ గడ్డ దేవాలయానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వస్తున్నారని తెలిపారు. రహదారి విస్తరణ పనుల వల్ల భక్తులకు అసౌకర్యం కలగకుండా జాతీయ రహదారి నుంచి నేరుగా ఆలయానికి చేరుకునేలా ప్రత్యేక ర్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.అలాగే స్వాగత తోరణం నుంచి ఆలయం వరకు మెట్ల నిర్మాణం, నూతన ఆర్చి ఏర్పాటు, గుడి చుట్టూ 50 అడుగుల పరిధిలో సీసీ ఫ్లోరింగ్ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పరిస్థితులు అనుకూలిస్తే దేవాలయం సమీపంలో అండర్ పాస్ నిర్మాణాన్ని కూడా పరిశీలించాలని అధికారులకు సూచించారు.నిర్దేశించిన గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని జాతీయ రహదారుల డీఈ రామకృష్ణకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయత్రి పాండు, కౌన్సిలర్లు రాజు, లత, మాజీ సర్పంచులు సుధీర్ రెడ్డి, వెంకన్న, ఆలయ కమిటీ చైర్మన్ హరి ప్రసాద్ రెడ్డి, ఆలయ ఈవో లావణ్య, నాయకులు నర్సింహా రెడ్డి, శ్రీకాంత్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆచరణాత్మక విద్యకు వేదికగా గీతం 'పాప్ కాన్ 2026'..

- **ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ జాతీయ సదస్సుకు రంగం సిద్ధం**
- **పరిశ్రమ నిపుణులు, విద్యావేత్తల సమ్మేళనం**
- **జూన్ 26, 27 తేదీల్లో రెండు రోజుల సదస్సు**

**రామచంద్రపురం (పటాన్చెరు), మే 20 (సిరి న్యూస్):**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం లోని స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో 'పాప్ కాన్ 2026' పేరిట ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ రెండు రోజుల జాతీయ సదస్సును జూన్ 26, 27 తేదీలలో నిర్వహించనున్నట్లు గీతం సెంటర్ ఫర్ బిజినెస్ ఎంగేజ్‌మెంట్ చైర్‌పర్సన్ డాక్టర్ జోసెఫ్ పాల్ తెలిపారు. భారతదేశంలో ఆచరణాత్మక విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణుల కోసం నిర్వహిస్తున్న తొలి ప్రత్యేక సదస్సుగా దీనిని అభివర్ణించారు.ఈ సదస్సుకు ప్రొఫెసర్ అరవింద్ సహాయ్ ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, డాక్టర్ ఇమంది శంకరరావు ముఖ్య వక్తగా కీలకోపన్యాసం చేయనున్నారు.దేశంలో ఆచరణాత్మక విద్యకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని, పరిశ్రమ అనుభవాన్ని విద్యా రంగంతో అనుసంధానించేందుకు ఈ సదస్సును రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో ప్యానెల్ చర్చలు, నిపుణుల ప్రసంగాలు, కార్యశాలలు, నెట్‌వర్కింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.పరిశ్రమ నుంచి విద్యారంగానికి మారడం, కేస్ స్టడీస్ రూపకల్పన, ఉన్నత విద్యలో ప్రొఫెసర్స్ ఆఫ్ ప్రాక్టీస్ పాత్ర, విద్యా రంగంలో వృత్తి అవకాశాలు వంటి అంశాలపై ప్రత్యేక చర్చలు జరగనున్నాయి. విద్యావేత్తలు, పారిశ్రామిక నిపుణులు, కార్పొరేట్ శిక్షకులు, కన్సల్టెంట్లు, డీన్లు, డైరెక్టర్లు, రిక్రూటర్లకు ఈ సదస్సు ఉపయోగపడుతుందని తెలిపారు.సదస్సులో పాల్గొనాలనుకునే వారు పేర్ల నమోదు, రుసుము వివరాల కోసం కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ అలేఖ్య మారంను cbe@gitam.edu ఈ-మెయిల్ ద్వారా లేదా 96500 89575 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# కంప్యూటర్ యుగానికి బాటలు వేసిన నేత రాజీవ్ గాంధీ

- **మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్**

**మెదక్ ప్రతినిధి, మే21(సిరి న్యూస్)**

కంప్యూటర్ యుగానికి బాటలు వేసిన నేత రాజీవ్ గాంధీ అని మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజ్ పేర్కొన్నారు.రాజీవ్ గాంధీ దేశానికి దూరదృష్టి కలిగిన నాయకుడు అని కొనియాడారు. గురువారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందుగుల గంగాధర్ ఆధ్వర్యంలో మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నివాళ్ళు అర్పించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ కేవలం 40 ఏళ్ల వయసులోనే దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి భారత దేశాన్ని ఆధునిక దిశగా నడిపించిన దూరదృష్టి నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. దేశంలో సాంకేతిక విద్యకు ప్రాధాన్యం కల్పించి కంప్యూటర్ యుగానికి బాటలు వేసిన గొప్ప నాయకుడిగా పేరొందాడని ఆమె పేర్కొన్నారు.అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ.. దేశ సమగ్రత కోసం గాంధీ కుటుంబం తమ రక్తాన్ని అర్పించిందన్నారు. మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ రాజీవ్ గాంధీలు దేశం కోసం ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు.పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందుగుల గంగాధర్ మాట్లాడుతూ.. 1991 మే 21న తమిళనాడులోని శ్రీపేరంబుదూర్‌లో ఎన్నికల ప్రచార సభలో ఎల్‌టిటిఈ ఉగ్రవాదుల ఆత్మాహుతి బాంబు దాడిలో రాజీవ్ గాంధీ మరణించడం దేశానికే తీరని లోటని అన్నారు. ఆయన సేవలను దేశ



ప్రజలు ఎప్పటికీ మరవలేరని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కానుగు భూపతి రాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్, సయ్యద్ ఉమర్, బుడ్డ రాజు, పిల్లి కొట్టాల నాగరాజు, దేవుల నాయక్, బాలరాజు యాదవ్, ఎండి ముజామిల్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు రాజయ్య మృతికి ప్రభుత్వమే కారణం

- **వడ్లు కొనుగోలు కాక మనస్తాపంతో రైతు ఆత్మహత్య**
- **రైతుల సమస్యలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది**
- **మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి**

**మెదక్ ప్రతినిధి,మే21 (సిరి న్యూస్)**



వడ్లు కొనుగోలు కాక తీవ్ర మనస్తాపానికి గురైె రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లాలో విషాదాన్ని నింపింది. శంకరంపేట్ మండలంలోని అంబాజీపేట గ్రామానికి చెందిన రైతు రాజయ్య మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి ఆరోపించారు.రైతు రాజయ్య ఆత్మహత్య విషయం తెలుసుకున్న పద్మా దేవేందర్ రెడ్డి గురువారం మండల నాయకులతో కలిసి చిన్న శంకరం పేట మండలం అంబాజీపేట గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి మనోధైర్యం చెప్పి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మెదక్ జిల్లా ఆస్పత్రి మార్చురీ గదిలో ఉన్న రాజయ్య మృతదేహాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ వడ్లు కొనుగోలు కాకపోవడం, చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక రైతు రాజయ్య తీవ్ర ఆవేదనకు గురై ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.రైతుల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి రోజుల తరబడి ఎదురు చూస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. రైతుల సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ పాలకులు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.మెదక్ జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వెంటనే ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇకపై రైతులు ఇలాంటి దారుణ నిర్ణయాలు తీసుకోకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ఆమె వెంట చిన్న శంకరంపేట మండల పార్టీ అధ్యక్షులు పట్లోరి రాజు, నాయకులు ప్రభాకర్, పడాల శ్రీనివాస్, మల్లుపల్లి సర్పంచ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.





# రీల్స్‌తో మెదక్ పర్యాటక అందాలను విశ్వవ్యాప్తం చేయాలి

- లోకల్ టు గ్లోబల్‌గా మెదక్ జిల్లా ఘన కీర్తిని ప్రపంచానికి తెలియజేయాలి
- టూరిస్ట్ గైడ్ కోసం దరఖాస్తుల సమర్పించాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ ప్రతినిధి, మే21(సిరి న్యూస్)**

రీల్స్‌తో మెదక్ పర్యాటక అందాలను విశ్వవ్యాప్తం చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు.లోకల్ టు గ్లోబల్‌గా మెదక్ జిల్లా ఘన కీర్తిని ప్రపంచానికి తెలియజేయాలని కోరారు.గురువారం మెదక్ జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్'పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు.మెదక్ జిల్లా టూరిజంను ప్రపంచానికి పరిచయం చేసేందుకు నిర్వహిస్తున్న ఈ కాంపిటీషన్‌పై ఇన్‌ఫ్లుయెన్సర్లు, మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా హ్యాండ్లర్లతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి చర్చించారు. రీల్స్ కాంపిటీషన్ విధివిధానాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, బహుమతుల వివరాలు తదితర అంశాలను వారికి వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాలలో భాగంగా మొదటిసారిగా వినూత్న పద్ధతిలో మెదక్ జిల్లాలోని అనేక పర్యాటక ప్రాంతాలకు బ్రాండింగ్ కలిగించే విధంగా 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్' నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. మెదక్ జిల్లా పర్యాటక ప్రాంతాలపై 4కే వీడియో క్వాలిటీతో రీల్స్ సమర్పించాల్సి ఉంటుందని, ఆసక్తి కలవారు తమ వీడియోలను మే 21వ తేదీ నుంచి మే 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో సమర్పించవచ్చని, ఆన్‌లైన్ విధానంలో డీపీఆర్ఓ రాజు 9949922291, ఏపీఆర్ఓ బాబు 9701306838 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించవచ్చని పేర్కొన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి జూన్ 2వ తేదీన నగదు ప్రోత్సాహకాలు అందించబడుతుందన్నారు. మెదక్ జిల్లాలో ఆధ్యాత్మిక దేవాలయాలు, ప్రకృతి పర్యాటక కేంద్రాలు, జలపాతాలు, అభయారణ్య అందాలు, గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు కలగలిసి అనేక పర్యాటక ప్రాంతాలు ప్రకృతి వైవిధ్యభరితంగా నెలవై ఉన్నాయని పేర్కొన్నారు. జూన్ మాసం నుంచి పర్యాటక ప్రాంతాలకు ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు వచ్చే అవకాశం ఉంటుందని, వారందరికీ మెదక్ జిల్లా సాదర ఆహ్వానం పలుకుతుందన్నారు. రీల్స్ కాంపిటీషన్ ద్వారా మెదక్ జిల్లా పర్యాటక ప్రాంతాలకు మంచి బ్రాండింగ్ వచ్చే విధంగా పూర్తి వివరాలతో, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా రీల్స్‌ను రూపొందించాలన్నారు.పర్యాటక దినోత్సవ టూరిస్ట్ గైడ్ పోస్టర్ ను ఆవిష్కరించారు.టూరిస్ట్ గైడ్ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు అట్టి దరఖాస్తులను నిబంధనలు మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి, డైరెక్టర్, పురావస్తు మరియు మ్యూజియంల విభాగం డా. పి. నాగరాజు డిప్యూటీ డైరెక్టర్ (మ్యూజియంలు) ఎన్. నరసింగ్, డిప్యూటీ డైరెక్టర్ (ఇంజనీరింగ్)డిపిఆర్ఓ రామచంద్ర రాజు, యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, పాత్రికేయులు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, యూట్యూబర్స్ తదితరులు పాల్గొన్నారు.

# తరుగు, తేమ పేరుతో రైతుల దోపిడీ ఆపాలి

- యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్
- ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై కలెక్టరేట్ లో బీజేపీ వినతి

**మెదక్ ప్రతినిధి,మే21(సిరి న్యూస్)**

రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న తీవ్ర జాప్యం, మౌలిక వసతుల లేమి, తరుగు–తేమ పేరుతో జరుగుతున్న రైతుల దోపిడీని అరికట్టి వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్ ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు లేక రైతులు రోజులు తరబడి ధాన్యంతో నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తరుగు, తేమ పేరుతో రైతులను మోసం చేస్తూ భారీ నష్టాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు.రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించే చర్యలు తీసుకోవాలన్నారు.వర్షాలు, ఎండల మధ్య రైతులు ధాన్యాన్ని కాపాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రైతాంగం ఆందోళనలో ఉందన్నారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, సుభాష్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డం కాశీనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఈర్ల రంజిత్ రెడ్డి, సంఘసానీ సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు



రాజేందర్, కౌన్సిలర్ శంకర్ గౌడ్, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు సతీష్, జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, జిల్లా నాయకులు మల్లారెడ్డి, మనోజ్, భాను, జనార్ధన్, బిక్షపతి, సత్యం, శ్రీనివాస్, విజయ్, మహిళా నాయకులు మల్లిక, లావణ్య, సంగీత, గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు నాయక్, మండల పట్టణ అధ్యక్షులు బెండ వీణ, సర్పంచ్ నవీన్ గౌడ్, అవినాష్ రెడ్డి, సంతోష్ చారి, బీజేపీ నాయకులు శ్యామ్, నగేష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ సమగ్రత, ఐక్యత కోసం ప్రాణాలు అర్పించిన రాజీవ్‌గాంధీ

- జోగిపేటలో ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి

**జోగిపేట, మే 21, (సిరి న్యూస్):**



జోగిపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశంలో సమాచార విప్లవానికి, కంప్యూటర్ రంగానికి ఆద్యుడు రాజీవ్‌గాంధీయన్నారు. 18 ఏళ్లకే యువతకు ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యంలో వారి భాగస్వామ్యం పెంచిన మహానేత అన్నారు. వైస్ చైర్మన్ చిట్టిబాబు మాట్లాడుతూ, 'దేశ సమగ్రత, ఐక్యత కోసం ప్రాణాలు అర్పించిన త్యాగమూర్తి యని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం నాయకులు రెండు నిమిషాలు మౌనం పాటించి రాజీవ్‌గాంధీకి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ జి.మల్లయ్య, కౌన్సిలర్ దుర్గేష్, మాజీ కౌన్సిలర్ ఎస్. సురేందర్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు ప్రవీణ్‌కుమార్, జిషాన్, నాయకులు డీజీ వెంకటేష్, చిట్యాల మధు, అనీల్, ఎండి అఫ్సర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# వరి కొయ్యలను కాల్చొద్దు ..

- మండల వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి

**కొల్చారం, మే 21,(సిరి న్యూస్ )**

నిప్పుపెడితే భూమి సారాన్ని కోల్పోతుంది దిగుబడీ తగ్గుతుంది ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుందనీ మండల వ్యవసాయ అధికారి శ్వేతాకుమారి తెలిపారు.పొలాన్ని కలియ దున్నితేనే పంటకు మేలు. గతంలో వరి పంటను కొడవళ్లతో మొదళ్ల దాకా కోసేవారు. అంతేకాకుండా పశువులు ఎక్కువగా ఉండటంతో గడ్డిని కుప్పలుకుప్పలుగా పశుగ్రాసం కోసం నిల్వ చేసేవారు. అయితే ప్రస్తుతం సాగు విధానంలో అనే క మార్పులొచ్చాయి. పశువుల సంఖ్య తగ్గిపోవడంతో యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు. మిషన్‌తో హార్వెస్టింగ్ చేసే సమయంలో పైకి కోయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. అవసరమున్న రైతులు కొంత గడ్డిని కోసి తీసుకొచ్చుకుని మిగిలిన దానిని అక్కడే వదిలేస్తున్నారు. దీంతో దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరికొయ్యలతోపాటు గడ్డిని కూడాకాలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్ల అధిక నష్టాలు వచ్చే అవకాశముందని అన్నారు

**ఎనిమిది రోజుల ముందుగా దున్నాలి..**

రైతులు చాలామంది వరినాటు వేసే సమయంలో మొదటి దఫా దున్నుడుకు, రెండో దఫా దున్నుడుకు మధ్య నాలుగు నుంచి ఐదురోజుల సమయం మాత్రమే తీసుకుంటారు. దీనివల్ల వరికొయ్యలు(కొయ్యకాలు), గడ్డి త్వరగా కుళ్లిపోవు. ఇలాంటి సమయంలో పశువులను అందులో వదిలితే అటూ తిరగడం, పొలం లో పేడ, మూత్ర విసర్జన చేయడం ద్వారా త్వరగా కుళ్లిపోయి భూసారంతోపాటు పంట దిగుబడి 5 శాతం పెరుగుతుంది. లేదంటే అందులోనే కలియదున్ని కనీసం ఎనిమిది రోజుల సమ యం తీసుకుని రెండోసారి దున్నాలి. వీలైతే మొదటి దఫాలో ఒక్కసారి రోటోవేటర్‌తో దున్నితే గడ్డి, కొయ్యకాలు చిన్న, చిన్న ముక్కలుగా విడిపోయి మరోసారి దున్నినప్పుడు ఎలాంటి సమస్యా ఉండదు. దున్నే ముందు ఎకరానికి క్వింటాలు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే వరికొయ్యలు, గడ్డి త్వరగా కుళ్లిపోతా యి. జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు వేసి ఏపుగా పెరిగిన తర్వాత కలియ దున్నితే భూమి సారవంతంగా మారుతుంది.

**సారాన్ని కోల్పోతుంది**

వరికొయ్యలను (కొయ్యకాలు) కాల్చితే నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదు . కాల్చడం ద్వారా విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని, ఫాస్ఫరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుంది. దిగుబడీ పోతుంది. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పం టలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. పొలాల్లో తిరిగే పాములు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనేక జీవరాసులు చనిపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. పొలాల గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు కాలిపోవడంతో పర్యావరణానికి హాని కలుగుతుంది. ఆలస్యంగా కోతకు వచ్చే పంటలు, కల్లాల దగ్గరే ఉన్న ధాన్యం కాలిపోయి నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

**పొలాన్ని కలియ దున్నితే కలిగే ప్రయోజనాలు**

వరి కొయ్యలను నేలలో కలియదున్నడం వల్ల సేంద్రియ కర్బనశాతం పెరిగి దిగుబడులు 5నుంచి 10శాతం వరకు పెరిగే అవకాశముంది.దుక్కి దున్నే సమయంలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది.కలియ దున్నితే ఎకరాకు దాదాపుగా టన్ను వరకు ఎరువు తయారవుతుంది.మొక్కలకు 2శాతం నత్రజని (యూరియా) 4శాతం ఫాస్ఫరస్ అదనంగా అందిస్తుంది.జింక్, మాంగనీస్, ఇనుము, క్యాల్షియం లాంటివి పంటకు మేలు చేస్తాయి.నేలలో కరుగని మూలకాలనూ పంటకు అనుకూలంగా మార్చుతుంది.నీటినిల్వ సామర్థ్యం పెరుగుతుంది.వరికొయ్యలకు (కొయ్యకాలు) నిప్పు పెట్టడం వల్ల గాలి, నేల కలుషితమవుతుంది. పంటలకు మేలుచేసే మిత్ర పురుగులు మరణిస్తాయి. వరికొయ్యలను పొలంలో కలియ దున్నితే సేంద్రియ ఎరువుగా మారుతుంది. ఎకరానికి దాదాపు టన్ను ఎరువు తయారవుతుంది. దున్నే ముందు తప్పనిసరిగా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే వరికొయ్యలు, గడ్డి మొక్కలు తొందరగా కుళ్లిపోతాయి. మురిగిన కొయ్యలు ఎరువుగా మారడటంతో దిగుబడి పెరుగుతుందనీ మండల వ్యవసాయ అధికారి శ్వేతాకుమారి తెలిపారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**పాపన్నపేట మే 21 (సిరి న్యూస్) :**



కుటుంబ కలహాలు సంతాన లేమితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చికోడ్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటింబికుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.బోయిని పర్వయ్య, అనూషమ్మలకు ఇరువురు కుమారులు కాగా పెద్ద కుమారుడు సంగమేశ్వర్, చిన్న కుమారుడు సాయిబాబా (32) లు కాగా ఇరువురి కుమారులకు వివాహాలు జరుపగా చిన్న కుమారుడు సాయిబాబా పని పాట చేయకుండా జులయిగా తిరిగుతూ సంసారం పట్టింపు లేకుండా తిరుగు తుండడం తో భార్య వాసవి తో తరచు గొడవలు చోటుచేసుకుంటుండమే కాక సంతానం లేక పోవడం మూలంగా గొడవలు జరుగు తుండేవి. బుధవారం భార్య భర్తల మధ్య గొడవ చేసుకోవడం తో మధ్యాహ్నం ఇంటిలోని గదిలోకి వెళ్ళి గడియ వేసుకోవడం తో అనుమానం వచ్చిన భార్య వాసవి, అత్త అను షమ్మ కు తెలుపడంతో ఇరువురు వెళ్ళి గడియ తీయాలని పిలిచినా పలుక కాపోవడంతో పెద్ద కుమారుడు సంగమేశ్వర్ సహాయం తో గడ్డపార తలుపులు సందు చేసుకొని చూడగా దూలనికి చీర తో ఉరి వేసుకొని ఉండడాన్ని గమనించి వెంటనే పాపన్న పేట పోలీసుల కు సమాచారం అదివ్వడం తో సమాచారం అందుకున్న పాపన్న పేట పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి పంచనామా నిర్వహించి. మృతుడి తల్లి అనూషమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యప్తు చేస్తున్నట్లు పాపన్న పేట ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కాగా మృతుడికి భార్య వాసవి, తల్లి అను షమ్మ ఉన్నారు.

## డబ్బులు ఇస్తారా క్వారీలు మూస్తారా

**కాజిపల్లి క్రషర్ల ఓనర్లకు బెదిరింపులు**

**క్వారీలు నడవాలంటే కప్పం కట్టాల్సిందే**

**కాజిపల్లిలో రెచ్చిపోతున్న దండుపాలెం ముఠా**

**పోలీసుల ఎంట్రీ.. క్రషర్ల ఓనర్లను బెదిరిస్తే ఊరుకోం**

**వసూళ్ల రాజుళ్ళ పై నిఘా పెట్టిన పోలీసులు**

**జిన్నారం మే 21 సిరి న్యూస్**

గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కాజి పల్లి గ్రామానికి చెందిన కొంతమంది నాయకులు కాజిపల్లి గ్రామ పరిధిలో ఉన్న కంకర క్వారీలోకి అక్రమంగా ప్రవేశించి అక్కడ పనిచేసే వారిని భయభ్రాంతులకు, గురిచేసి చంపుతామని బెదిరించడం జరిగింది. అదే కాకుండా క్వారీ యాజమానికి ఫోన్ చేసి తాము ఈ మధ్యనే ఎన్నికైన నాయకులం మాకు అందరికీ ఒక కోటి రూపాయలు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.డబ్బులు ఇవ్వకపోతే క్వారీ మూసివేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని, వెంకట ప్రసాద్ బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే బాధితులను గుర్తించి కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించామని తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో గల పరిశ్రమలు మరియు క్వారీ,క్రషర్ ఇతర యాజమాన్యల కు తెలియజేయునది ఏమనగా ఏటువంటి బెదిరింపు కాల్స్ వచ్చిన భయపడొద్దు అని వారికి ధైర్యం చెప్పడం జరిగింది అని అన్నారు.క్రషర్ లు మరియు పరిశ్రమలకు ఎవరైనా, ఎంతటి వారైనా డబ్బులు డిమాండ్ చేస్తే, సంస్థల యాజమాన్యాలు, పోలీసులకు ఫిర్యాదు చేస్తే తక్షణమే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## వడ్లను నిల్వ చేయుటకు రైతు వేదిక కేటాయింపు

**వెల్దుర్తి తహసిల్దార్ శ్రీనివాస్**



**వెల్దుర్తి,మే 21, (సిరి న్యూస్):**

వెల్దుర్తి మండలం హస్తాల్పూర్ గ్రామం లోనిబాలాజీ రైస్ మిల్ కు సంబంధించిన వడ్ల ను నిల్వ చేయుటకు, హస్తల్పూర్ గ్రామంలో ఉన్న రైతు వేదికను అధీనం లోకి తీసుకోవడం జరిగినది అని తహసిల్దార్ శ్రీనివాస్ తెలిపారు.ఇట్టి గోదాం లోకి మెల్లూర్ హస్తాల్పూర్ గ్రామంలోని వడ్లను సెంటర్ల నుండి ట్రాక్టర్ల ద్వారా లోడింగ్ చేసుకొని ఇట్టి రైతు వేదిక వద్ద అన్లోడింగ్ చేస్తున్నామని, రైతులకు ఎటువంటి ఇబ్బంది కాకుండా కొనుగోలు కేంద్రాల వద్ద నుండి ధాన్యం తూకం చేసి ట్రాక్టర్ ల ద్వారా రైతు వేదిక వద్దకు పంపించి అక్కడే అన్లోడింగ్ చేస్తాం అని తెలిపారు. దీని ద్వారా రెండు గ్రామంలో ఉన్న దాన్యం కొనుగోలు కేంద్రాలలో త్వరగా వడ్లను కొనుగోలు చేసి రైస్ మిల్ కు పంపడం జరుగుతుందని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ శ్రీనివాస్, నర్సింగ్ యాదవ్, రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## నేడు కొండాపూర్ లో టీజీఐఐసీ చైర్మన్ పర్యటన

**జొన్నల కొనుగోలు ప్రారంభం**

**మే 21, (సిరి న్యూస్):**



మండల పరిధిలోని గొల్లపల్లి,కొండాపూర్,మారేపల్లి పీఏసీఎస్ కేంద్రాలలో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి టీజీఐఐసీ చైర్పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు గురువారం కొండాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు గొల్లపల్లి, 2:30 గంటలకు కొండాపూర్, 3 గంటలకు మారేపల్లి సొసైటీ కేంద్రాలలో జొన్నల కొనుగోలను ప్రారంభించనున్నారు. రైతులు పండించిన పంటలను తగిన మౌలిక వసతులతో పాటు అందుబాటులో ధాన్యాన్ని విక్రయించేందుకు ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక ఏర్పాట్లను రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ లు ,ప్రజాప్రతినిధులు నాయకులు, రైతులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యల హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## వ్యక్తి ఆత్మహత్య

**తూప్రాన్ మే 21 సిరి న్యూస్**



తూప్రాన్ మండలంలోని నాగులపల్లి గ్రామ శివారులో వెల్దుర్తి మండలం షేరిల గ్రామానికి చెందిన కొట్టముల షేకులు కుమారుడి ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడం ఆసుపత్రుల చుట్టూ తిరగడం ఆర్థిక ఇబ్బందులతో నిన్న రాత్రి మనస్థాపానికి గురై చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య నాగమణి ఇచ్చిన కంప్లైంట్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నామని తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపారు

## రామాయంపేట లో రాజీవ్ గాంధీకి ఘనంగా నివాళులు.



**రామాయంపేట, మే 21 (సిరి న్యూస్)**

రామాయంపేట మున్సిపల్ పరిధిలో భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు ఘనంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా మెదక్ చౌరస్తాలో పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు రమేష్ రెడ్డి, వైస్ చైర్పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్స్ పుట్టి సందీప్ ,దేవుని రంజిత్ , దాకి శ్యామల స్వామి, బైరం స్వప్న కుమార్ , కో ఆప్షన్ మెంబర్స్ దేమే యాదగిరి , గౌస్ , చింతల రాధా భవాని యాదగిరి ,మెదక్ DCC ఉపాధ్యక్షుడు చింతల యాదగిరి,జిల్లా కార్యదర్శి పోచమ్మల గణేష్ ,పట్టణ అధ్యక్షుడు చింతల సప్న స్వామి ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాకి స్వామి,అశోక్ గారు విప్లవ్ ,దండు శివకుమార్ ,మట్టి యాదగిరి, ప్రకాష్ , మోబిన్ బైరం శంకర్ , ఒడ్డి స్వామి ,సిద్ధిరాములు ,యూత్ కాంగ్రెస్ నాయకులు. చింతల నరేష్, చిలుక విరాట్. దేవుని రమేష్ అక్కల నరేందర్ సాయి తేజ డాకి నాగేందర్ సుధీర్ గౌడ్ గణేష్ తదితరులు పాల్గొనడం జరిగింది....

## ఈవీ కారు ఎక్కిన ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి

### స్వయంగా ఈవీ కారు నడిపి పర్యావరణ పరిరక్షణకు మద్దతు

**పటాన్చెరు, మే 21, (సిరి న్యూస్):**
ప్రధానమంత్రి పిలుపు మేరకు పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపును ప్రోత్సహిస్తూ ఎమ్మెల్సీ స్వయంగా ఎలక్ట్రిక్ కారును నడిపారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రపురంలోని తన నివాసం నుంచి నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయన లగ్జరీ పెట్రోల్/డీజిల్ కారును పక్కన పెట్టి ఈవీ కారులో ప్రయాణించారు.ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఇంధన పొదుపు, గ్రీన్ ఎనర్జీపై విస్తృత అవగాహన కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ప్రజాప్రతినిధులుగా తాము ముందుగా ఆచరించి చూపితేనే ప్రజల్లో మార్పు వస్తుందనే ఉద్దేశంతో ఈ ప్రయత్నం చేశానని తెలిపారు.పెరుగుతున్న కాలుష్యం, ఇంధన ధరల నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగం, ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల వాడకం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. దేశంలో గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ వారంలో కనీసం ఒక్కరోజైనా ఈవీ వాహనాలు లేదా ప్రజా రవాణాను వినియోగించాలని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి పిలుపునిచ్చారు.

## నేడు సత్య కన్వెన్షన్ హాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం

**కామారెడ్డిజిల్లా ప్రతినిధి, మే 21, (సిరి న్యూస్):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా కామారెడ్డిజిల్లా స్థాయి సమావేశం శుక్రవారంనిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు.ఈ సమావేశం 22-05-2026 శుక్రవారం ఉదయం 10.00 గంటలకు కామారెడ్డి పట్టణంలోని సత్య కన్వెన్షన్ హాల్‌లో జరుగుతుందని పేర్కొన్నారు.జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల పురోగతి, 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయ మిత్రులు, శాఖల సిబ్బందినీ ఆహ్వానిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

## 18 సంవత్సరాలు నిండిన ప్రతి గౌడ బిడ్డకు లైసెన్స్ ఇవ్వాలి

### ముస్మీర్ పర్షరాములు గౌడ్, సిద్దిపేట జిల్లా జైగౌడ జనరల్‌సెక్రటరీ

**నంగునూరు, మే 21, (సిరి న్యూస్):**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న తెలంగాణ వ్యాప్తంగా కొత్త పెన్షన్లు మంజూరు చేస్తున్న సందర్భంగా గౌడ కులానికి చెందిన ప్రతి యువకుడికి గౌడ కుల ధృవీకరణ పత్రాన్ని ఆధారంగా తీసుకొని లైసెన్స్‌లు మంజూరు చేయాలని జై గౌడ సిద్దిపేట జిల్లా జనరల్ సెక్రెటరీ ముష్మీర్ పరుశురాములు గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ గౌడ బిడ్డ పుట్టుకతోనే వృత్తితో అనుబంధం కలిగి ఉంటాడని, తాటిచెట్లు ఎక్కిన వారికే కాకుండా గౌడకుల సర్టిఫికెట్ ఉన్న ప్రతి ఒక్కరికీ లైసెన్స్ ఇవ్వాలని కోరారు. అలాగే 50 సంవత్సరాలు దాటిన లైసెన్స్ లేని గౌడలకు ప్రత్యేకంగా పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఎన్నో సంవత్సరాలుగా గౌడ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి, వారి అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. సిద్దిపేట జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో గౌడ కమ్యూనిటీ హాల్‌లు, గౌడ విద్యార్థుల కోసం హాస్టల్ భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. గౌడ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆర్థికంగా బలోపేతం చేసే సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాలని కోరారు. గౌడ సమాజ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, గౌడల హక్కులు, గౌరవాన్ని కాపాడే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# రైతు ఆత్మహత్య అనే వార్తలు అవస్తవం

- **రైతులు ధైర్యంగా ఉండాలి**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ ప్రతినిధి, మే21(సిరి న్యూస్)**

జిల్లాలో ఇటీవలే ధాన్యం కొనుగోలు కారణంగా రైతు ఆత్మహత్య అనే వార్తలు అవాస్తవమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు.ధాన్యం కొనుగోలు సందర్భంలో రైతు ఆత్మహత్య అనే కథనంపై జిల్లా కలెక్టర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆమె మాట్లాడారు కుటుంబ కలహాలు వివిధ కారణాలతోనే జరిగినట్లుగా తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కొన్ని పత్రికల్లో ప్రచురితమైన వార్తల నేపథ్యంలో వాస్తవ పరిస్తితి నివేదిక ప్రకారం రైతు తన కుటుంబం లోని కలహాల కారణంగా ఆత్మహత్య కి పాల్పడినట్లు తెలిసిందన్నారు. ఇందులో ధాన్యం కొనుగోలు చేయకపోవటం కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడు అన్నది అవాస్తవమని తెలిపారు.జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాల ప్రకారం ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిరంతరం కొన సాగుతోందన్నారు.ఇప్పటి వరకు సుమారు 2 లక్షల 11 వేల మెట్రక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగి, రైతుల ఖాతాల్లో రూ.311 కోట్లను 28,521 మంది రైతులకు నేరుగా జమ చేయడం పూర్తయిందని వెల్లడించారు.ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతుల సౌకర్యార్థం సీరియల్ విధానంలోనే ధాన్యం కొనుగోలు జరుగుతోందన్నారు.ధాన్యం రవాణా, మిల్లులకు కేటాయింపు, అన్‌లోడింగ్ తదితర ప్రక్రియలు పరిస్థితులకు అనుగుణంగా సమన్వయం చేస్తూ నిర్వహిం చబడుతున్నాయన్నారు.. కొన్ని ప్రాంతాల్లో ఒకేసారి అధికంగా ధాన్యం రావడం వల్ల తాత్కాలికంగా ఆలస్యం జరిగిన సందర్భాలు ఉన్నప్పటికీ, వాటిని వెంటనే పరిష్కరించే చర్యలు తీసుకోవడం జరుగు తోందన్నారు. సంబంధిత సివిల్ సప్లైస్ అధికారులు, తహసీల్దార్లు మరియు ఇతెర శాఖల అధికారులు నిరంతరం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుం టున్నారని తెలిపారు. రైతులకు చెల్లింపులు కూడా నిరంతరంగా జరుగుతున్నా యన్నారు.రైతులు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా అధికార యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రైతులు ధాన్యం కొనుగోలు ఆలస్యం పట్ల ఎటువంటి ఆందోళనకు గురికాకుండా అధికార యంత్రాంగానికి సహకరించాలన్నారు.ఈ మేరకు సంబంధిత అధికారులకు వేగవంతంగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసి మిల్లులకు తరలించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు ఇటువంటి పరి స్థితిలలో రైతులకు ధైర్యం చెప్తూ, తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

# భగ్గుమంటున్న ఎండలలో ఉపశమనంగా ఎన్సాన్‌పల్లి చెరువు

- **యువత కేరింతలతో కళకళలాడుతున్న చెరువు**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, మే 21, (సిరి న్యూస్):**
రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్న వేళ ఎన్సాన్‌పల్లి గ్రామ చెరువు యువతకు ఆహ్లాదకరమైన చల్లని నిలయంగా మారింది. మండుతున్న ఎండ వేడిని తట్టుకోలేక గ్రామ యువకులు చెరువులోకి దిగి ఈత కొడుతూ ఉపశమనం పొందుతూ సందడి చేస్తున్నారు. స్నేహితులతో కలిసి నీటిలో ఆటలు ఆడుతూ, కేరింతలు కొడుతూ, ఈతలో తమ ప్రతిభను ప్రదర్శిస్తూ యువత ఉత్సాహంగా గడుపుతున్నారు. చెరువు చుట్టూ యువత నవ్వులు, సందడి గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు యువకులు చెరువు వద్దకు చేరుకుని ఎండ వేడిని మరిచిపోయేలా ఆనందంలో మునిగిపోతున్నారు. సహజ సిద్ధమైన నీటిలో గడపడం వల్ల శరీరానికి చల్లదనం లభించడమే కాకుండా మానసిక ప్రశాంతత కూడా కలుగుతోందని యువకులు చెబుతున్నారు. చిన్నారులు, యువత చెరువులో ఈత కొడుతూ కనిపిస్తున్న దృశ్యాలు గ్రామంలో వేసవి సంబరాలను తలపిస్తున్నాయి. ఈత అనేది కేవలం వినోదమే కాకుండా శరీరానికి అత్యుత్తమ వ్యాయామమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈత వల్ల శరీరంలోని ప్రతి భాగానికి వ్యాయామం అందడంతో పాటు కండరాలు దృఢంగా మారుతాయని, గుండె ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు శ్వాసకోశ వ్యవస్థ బలపడుతుందని, మానసిక ఒత్తిడి తగ్గి ఉల్లాసం పెరుగుతుందని, రోజువారీ జీవితంలో ఉత్సాహం, చురుకుదనం పెరగడానికి ఈత ఎంతో ఉపయోగకరమని గ్రామ యువత అభిప్రాయ పడుతున్నారు. ఎండల తీవ్రత మధ్య చెరువు వద్ద నెలకొన్న ఉత్సాహభరిత వాతావరణం గ్రామ ప్రజలను ఆకట్టుకుంటోంది. ఒకవైపు చల్లని నీరు ఉపశమనాన్ని అందిస్తుండగా, మరోవైపు యువత కేరింతలు కొత్త



ఉల్లాసాన్ని తీసుకొస్తున్నాయి. అయితే చెరువులో ఈత కొట్టే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని గ్రామ పెద్దలు సూచిస్తున్నారు. లోతైన ప్రాంతాలకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని, చిన్నారులు పెద్దల పర్యవేక్షణలోనే నీటిలోకి దిగాలని హెచ్చరిస్తున్నారు. ఇలా భగ్గుమంటున్న ఎండలకు ఎన్సాన్‌పల్లి చెరువు చల్లని ఊరటనిస్తూ, యువత సందడితో గ్రామంలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.

# ఉనికి కోసం ఎమ్మెల్యే రైతుల మీద పినతల్లి ప్రేమ చూపడం సిగ్గు చేటు

### ఏఎంసీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి

**తొగుట, మే 21,(సిరి న్యూస్):**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కొనసాగుతున్న ప్రజాపాలనలో ప్రజలకు సంక్షేమ పాలన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి జరిగి కాంగ్రెస్ పార్టీ ప్రజలలో చెరగని ముద్ర వేసుకుందని, తద్వారా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అయిందని, అదేవిధంగా దుబ్బాక నియోజకవర్గంలో కూడా పార్టీ పుంజుకుందని తొగుట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ పరిస్థితిని జీర్ణించుకోలేని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి బిఆర్ఎస్ ఉనికిని కాపాడుకునేందుకు రైతుల పట్ల తల్లి ప్రేమను చూపిస్తూ వారి సానుభూతిని పొందేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటని విమర్శించారు. తొగుట మండలంలోని బండారుపల్లి, గుడికందుల, గోవర్ధనగిరి, వరదరాజు పల్లి ఘనపూర్ గ్రామాలలో ఏఎంసీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి



గురువారం ఐకెపి సెంటర్స్ తనికి చేశారు. అలాగే తుక్కాపూర్ 5000, తొగుట 5000 మెట్రిక్ టన్నుల గోదాంలను సివిల్ సప్లై అధికారులతో విజిట్ చేశారు. వడ్లను ఆ గోదాంలలో నిలువ చేసుకోవచ్చని నిర్ధారించు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వద్ద కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చి పార్టీ ఉనికి కోసం రైతుల ముందు సవతితల్లి ప్రేమ చూపారని, రైతుల సమస్యను రాజకీయం చేసి పబ్బం కడుక్కోవడం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికే చెల్లిందని ఎద్దేవా చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో వరి వేస్తే ఉరి అన్న మాటలు మరిచిపోయి ఎమ్మెల్యే అలా మాట్లాడడం సిగ్గుచేటని మనిపడ్డారు. కానీ తమ కాంగ్రెస్ ప్రభుత్వం నాడు నేడు రైతు శ్రేయస్సు కోసం పనిచేస్తుందని, ఎప్పటికప్పుడు ఐకెపి సెంటర్లను సందర్శిస్తూ వడ్లను తరగతిన కొనుగోలు చేస్తూ మిల్లుల వద్ద స్థానిక అధికారులతో కలిసి అన్లోడ్ చేయిస్తూ లారీల కొరత లేకుండా చూస్తున్నామన్నారు. ఆనాడు స్వర్గీయ మాజీ మంత్రి చెరుకు ముత్యం రెడ్డి ముందు చూపుతో గోదాంలు నిర్మాచడం వల్లనే నేడు దుబ్బాక నియోజకవర్గంలో వడ్లు నిలువ చేసుకుంటున్నామని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం బాబురావు, ఉపసర్పచ్ శ్రీనివాస్, యాదగిరి, రాజశేఖర్, కోపరేటివ్ సిబ్బంది స్వామి, ఏఎంసీ డైరెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలి

- **అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి ప్రతినిధి,మే 21, (సిరి న్యూస్):**
జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. ఎలాంటి తప్పులు లేని, అత్యంత పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనే జిల్లా యంత్రాంగం, రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన అన్నారు.గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటర్ జాబితా సవరణకు సంబంధించిన వివిధ దశలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.ఈ ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఓటర్ల జాబితాను పరిశీలించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలు తక్షణమే అన్ని నియోజకవర్గాలలో బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలని, అధికారులు మరియు రాజకీయ పార్టీల ప్రతినిధులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన వివిధ దశల షెడ్యూల్ వివరాలను సమావేశంలో వివరించారు.ఈ సమావేశంలో సంగారెడ్డి తహసిల్దార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈఏపీసెట్‌లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన ముక్రమ్ అహ్మద్‌కు షబ్బీర్ అలీ సన్మానం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 21,(సిరి న్యూస్):**
టీజీ–ఈఏపీసెట్ (వ్యవసాయ & ఫార్మసీ విభాగం)లో రాష్ట్ర స్థాయిలో ఓవరాల్ ప్రథమ ర్యాంకు సాధించి కామారెడ్డి జిల్లాకు గర్వకారణంగా నిలిచిన విద్యార్థి ముక్రమ్ అహ్మద్‌ను తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఘనంగా అభినందించారు. గురువారం హైదరాబాద్ సచివాలయంలోని తన కార్యాలయ ఛాంబర్‌లో ముక్రమ్‌ను ఆయన ప్రత్యేకంగా సత్కరించారు. టీఎంఆర్ఈఐఎస్ విద్యాసంస్థకు చెందిన ముక్రమ్ అహ్మద్ 150.17 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు కైవసం చేసుకోవడం పట్ల షబ్బీర్ అలీ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి చూపిన ప్రతిభ, కృషి, క్రమశిక్షణలకే ఈ విజయం నిదర్శనమని కొనియాడారు. భవిష్యత్తులో ఉన్నత విద్యతో పాటు వృత్తి జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రస్థాయి ర్యాంకులతో కామారెడ్డి విద్యార్థు లు అత్యధిక మార్కులు సంపాదించి జిల్లా ప్రతిష్టను ప్రగతి పదం వైపు తీసుకెళ్లారన్నారు.ఈ సందర్భంగా కామారెడ్డి పట్టణానికి చెందిన పలువురు మైనార్టీ విద్యార్థులు సాధించిన అద్భుతమైన ఫలితాలను షబ్బీర్ అలీ ప్రశంసించారు. అస్మా జుబిన్(బైపిసి–2 విభాగం) – రాష్ట్ర ద్వితీయ ర్యాంకు,షారికా ముస్కాన్ బైపిసి – 2రాష్ట్ర తృతీయ ర్యాంకు,హురాయా దిల్షాత్ బైపిసి –1 రాష్ట్ర తృతీయ ర్యాంకు ఆయేషా సిద్ధిఖా బైపిసి– 1రాష్ట్ర తృతీయ ర్యాంకు,అఫియా తబ్బస్సుమ్ బి పి సి– 1రాష్ట్ర నాల్గవ ర్యాంకు సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ అందరికీ అభినందనలు తెలియజేశారు.విద్యతోనే సమాజ మార్పు సాధ్యంఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడం గొప్ప విషయం అన్నారు.

# కామారెడ్డిలోఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 21, (సిరి న్యూస్):**
కామారెడ్డిజిల్లా కేంద్రంలోని నిజాం సాగర్ చౌరస్తా ప్రాంతంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ నిప్పు ఉమారాణి శ్రీనివాస్తూ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వర్ధంతిని పురస్కరిం చుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను స్మరించుకుంటూ, యువతకు ఆయన ఒక ఆదర్శమూర్తి అని పేర్కొన్నారు. రంగంలో కొత్త ఒరవడులు సృష్టించి యువతకు ఉద్యోగ అవకాశలను కల్పించడంలో ముందు న్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు అలే మల్లికార్జున్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సందీప్,మాజీ డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావ్,కౌన్సిలర్లు అన్వర్, షేరు, రామ్మోహన్, గణేష్, సత్యం, సిద్దిక్, వాజిద్, అంజాద్, లడ్డు, సాయిలు, జావీద్, బబ్లు,మోతిలాల్, కో–ఆప్షన్ సభ్యులు గొనె సునీత శ్రీనివాస్,మాజీ పట్టణ అధ్యక్షులు పండ్ల రాజు,చాట్ల రాజేశ్వర్ మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పాము కాటేసినా ఏమీ కాని జంతువులివే

పాములు అనగానే దాదాపు ప్రతి ఒక్కరూ భయంతో వణికిపోతారు. అలా కాకుండా నిమ్మలంగా ఉండే వారి సంఖ్య తక్కువే. మరీ ముఖ్యంగా విషపూరిత పాములను చూస్తే నిశ్శబ్దంగా నిలబడిపోయే వారే ఎక్కువ. కానీ, కొన్ని జంతువులకు మాత్రం ఆ భయం ఉండదు. ఎందుకంటే... వాటిపై పాము విషం ఎటువంటి ప్రభావం చూపదు! అవును, పాముకాటేసినా కూడా ఏమాత్రం ప్రమాదం ఉండని కొన్ని జంతువులు ఉన్నాయి. అవి ఏనుగులాంటి భారీ జంతువులు కాదు చిన్న చిన్న జంతువులే. పాము కాటు వేస్తే భారీ ఆకారంతో ఉండే ఏనుగు కూడా కుప్పకూలుతుంది. మరి పాము కాటును కూడా చీమ కాటులా చూసే ఈ చిన్న జంతువులు ఏవి? వీటిపై పాము విషం ఎందుకు ప్రభావం చూపదు? రండి తెలుసుకుందాం.

పాము అనగానే ముందుగా గుర్తొచ్చేది ముంగీస. ఈ రెండిటిది జాతి వైరం. అందుకే పాము అనగానే ముంగీసను తలచుకోకుండా ఉండలేం. వీటి మధ్య శత్రుత్వం ఎంతంటే, ఎక్కడ చూసినా పోరాటమే. ఈ పోరులో ముంగీసను పాము కసితీరా కాటు వేసినా అది ప్రాణాంతకం కాదు. ఎందుకంటే ముంగీస శరీరంలో ఉన్న ప్రత్యేకమైన ప్రోటీన్లు పాము విషాన్ని విరగొట్టేస్తాయి. ఇంకో మాటలో చెప్పాలంటే న్యూట్రలైజ్ చేస్తాయి. ఇవి సహజ రోగనిరోధక శక్తిని కలిగించి విషానికి విరుగుడులా పనిచేస్తాయి. విషం ఒల్లంతా పాకగుండా అడ్డుకట్ట వేస్తాయి. అయితే ఎక్కువ సార్లు కాటుకు గురైతే ముంగీస ప్రాణాలపై ప్రమాదం ఉండొచ్చు.

## ఒపోసమ్

అమెరికాలో కనిపించే ఈ జంతువు శరీరంలో లేప్‌టిన్‌బైండింగ్ ప్రోటీన్ అనే ఒక స్పెషల్ ప్రోటీన్ ఉంటుంది. ఇది పాము విషంలో ఉన్న హానికరమైన టాక్సిన్లను నిర్వీర్యం చేస్తుంది. ముఖ్యంగా రాటిల్ స్నేక్ వంటి అత్యంత విషపూరిత పాము కాటు అయినా ఒపోసమ్‌కి పెద్దగా ప్రభావం ఉండదు. శాస్త్రవేత్తలు ఈ ప్రోటీన్‌ను తీసుకుని పాముకాటుకు ఔషధాల తయారీలో కూడా ప్రయోగాలు చేస్తున్నారు.



## అడవిపంది

అడవుల్లో స్వేచ్ఛగా తిరుగుతూ కనిపించే అడవి పందుల శరీర నిర్మాణం బలంగా ఉండటం వల్లే కాకుండా, వీటి శరీరంలో న్యూరోటాక్సిన్ రిసిస్టెంట్ రిసెప్టర్లు ఉండటం వల్ల కూడా ఇవి పాము విషాన్ని తట్టుకోగలవు. అదే కాదు, కొన్ని పరిశోధనల ప్రకారం వీటి రక్తంలో ఐన్‌ఫ్లమేటరీ ప్రోటీన్‌ల ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల, విషాన్ని ఆగిపెట్టే ప్రాథమిక చర్య చాలా వేగంగా జరుగుతుంది. అందువల్లే పాముల కాటు వీటికి పెద్దగా ముప్పుగా మారదు.

## హనీ బ్యాడ్జర్

ప్రపంచవ్యాప్తంగా భయమంటే తెలియని ప్రాణి ఏదైనా ఉందంటే అది ఇదే. ఎదురుగా ఏ జంతువు ఉన్నా లెక్కే చేయదు. ఇది ఆఫ్రికా, ఇండియా, సౌత్ ఆసియా ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఈ జీవి తన దూకుడుతో చాలా పాములను వేటాడుతుంది. ఎంతో విషపూరితమైన పాముల కాటుకూ ఇది భయపడదు. హనీ బ్యాడ్జర్ శరీరంలో ఓపియోసిడ్ రిసెప్టర్లు పాము విషానికి నిరోధకంగా ఉంటాయి. పాము కాటుకు గురైనప్పుడు కొన్ని నిమిషాలు అలసట, స్తబ్ధత వస్తాయి. ఇది పామును చంపి తినడం వలన కూడా దాని విషాన్ని సహించగలగడం శరీరానికి అలవాటయ్యే లక్షణంగా కూడా భావించవచ్చు.

## చెక్క ఎలుక



ఎలుకల్లో చాలా రకలా జాతులుంటాయి. వీటిలో చెక్క ఎలుక ఒకటి. ఈ చెక్క ఎలుక, ఇది పాము విషం ద్వారా ఏమాత్రం ప్రభావితం కాదు. కానీ పాములకు ఈ ఎలుకలు ఆహారమైపోతుంటాయి. పెద్ద పాములు వీటిని గుటకాయస్వాహా చేస్తుంటాయి. దీంతో ఈ ఇవి పాములకు ఆమడ దూరంలో ఉంటాయి. పాము అలికిడి వింటే తుర్రుమని పారిపోతాయి. బొరియాల్లో దాక్కుంటాయి.



# రోజూ ఈ పనులు చేస్తే.. లైఫ్ అంతా హ్యాపీ

మనం జీవితంలో ఎప్పుడూ కోరుకునేది ఏంటో చెప్పండి..? ఆనందంగా ఉండాలి.. ఆరోగ్యంగా ఉండాలి.. ఎక్కువ కాలం జీవించాలి.. ఆర్థికంగా స్థిరంగా ఉండాలి.. ఇవేగా! ఇలా మనం ఆనందంగా ఎక్కువ కాలం జీవించాలంటే తప్పకుండా ఐదు అలవాట్లను మన రోజు వారీ పనుల్లో భాగం చేసుకోవాలని అంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం.



## ఆరోగ్యకరమైన అల్పాహారం

ఉదయం లేచిన తర్వాత మన శరీరానికి అవసరమైన పోషకాలన్నీ ఉండేలా ఓ మంచి బ్రేక్ఫాస్ట్‌ని సిద్ధం చేసుకుని తినాలి. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మానేయొద్దని అధ్యయనాలు చెబుతున్నాయి. ఉదయం కాజూ, బాదాం, పిస్తా, వాల్‌నట్స్, ఖర్జూరం లాంటి నట్‌స్‌తో పాటు ప్రోటీన్‌లు ఎక్కువగా ఉండే అల్పాహారాన్ని తప్పకుండా తీసుకోవాలి. అప్పుడు మన శరీరం శక్తివంతంగా ఉండి రోజు వారీ పనులను హుషారుగా చేయగలుగుతుంది.

## పాజిటివ్‌గా ఉండడం


ఇంటి నుంచి బయటలు దేరి సొసైటీలోకి వెళతాం కదా. అలా బయటకు వెళ్లిన తర్వాత మొదటిసారి మీరు కలుసుకున్న పరిచయస్తుడితో మీరు చాలా పాజిటివ్‌గా మంచి విషయాలను మాట్లాడేందుకు ప్రయత్నించండి. వారు మీ పొరుగింటి వారు కావొచ్చు. ఆఫీసులో మీ కొలీగ్ అయి ఉండొచ్చు. వారితో కొంత మంచి సంభాషణను చేయండి. దీని వల్ల ఆ పాజిటివ్ వైబ్స్ రోజంతా ఉంటాయి.

## వీలైతే ఓ కప్పు కాఫీ

ఉదయాన్నే ఓ కప్పు కాఫీ తాగడం వల్ల మనం ఆ రోజంతా రిలాక్సింగ్‌గా, ఆనందంగా ఉండొచ్చు. కాఫీ తాగడం వల్ల విసుగు, ఒత్తిడి, ఆందోళన తగ్గుతుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే రోజుకు ఒక కప్పుకు మించి దీన్ని తాగకూడదని గుర్తుంచుకోవాలి. ఇలా రోజును ప్రశాంతంగా మొదలు పెడితే ఆ రోజు మనం నిర్వర్తించాల్సిన బాధ్యతలన్నీ సక్రమంగా పూర్తవుతాయి.
చిన్న చిన్న వాటిలోనూ ఆనందాన్ని వెతుక్కోవడంరోజులో ఎదురయ్యే చిన్న చిన్న విషయాల్లోనూ ఆనందాన్ని వెతుక్కోండి. చల్లటి పిల్లగాలి వీస్తుందనో, సీతాకోక చిలుక రెక్కలను రెపరెప లాడిస్తూ అలా అలా ఎగురుతుందనో, చిన్న పిల్లాడు స్వచ్ఛంగా నవ్వుతున్నాడనో, మీ తోటలోని కొత్త మొక్క పూలు పూసిందనో.. ఇలా ప్రతి చిన్న విషయాన్నీ చెప్పలేనంత సంతోషంతో స్వీకరించండి. నమ్మండి మీ జీవితంలో అంతులేని ఆనందాలు.. రోజూ మిమ్మల్ని అబ్బురపరుస్తూనే ఉంటాయి.

## జీవిత లక్ష్యం

మన జీవిత లక్ష్యం ఏమిటి? అనే విషయంలో స్పష్టంగా ఉండాలి. ఉదయం లేచిన తర్వాత దాన్ని ఒకసారి గుర్తు తెచ్చుకోండి. దాని కోసం ఆ రోజులో ఏమేం చేయాలో ప్రణాళిక వేసుకోండి. అంతా బాగానే జరుగుతుందని మనసుకు పదే పదే చెప్పుకుంటూ ఉండండి. అంతే. ఉదయం లేచిన తర్వత ఈ ఐదు పనులు తప్పకుండా చేసేందుకు చూడండి. శారీరకంగా, మానసికంగా మీరు చాలా ఉత్సాహంగా ఉంటారు. విజయాలను అందుకుంటారు.




# మళ్లీ ఫామ్‌లోకి త్రిష

## హీరోయిన్ల మధ్య కొత్త పోటీ



దక్షిణాది సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్ త్రిష పేరు మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. దాదాపు రెండు దశాబ్దాలుగా తన నటన, అందంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న త్రిష.. మధ్యలో కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్నారు. ఆ సమయంలో ఆమె రాజకీయాల్లోకి వెళ్లబోతున్నారనే ప్రచారం కూడా జోరుగా సాగింది. దీంతో అభిమానుల్లో ఆందోళన నెలకొంది. అయితే ఆ వార్తలన్నీ కేవలం పుకార్లేనని, తన దృష్టి పూర్తిగా సినిమాలపైనే ఉందని త్రిష స్పష్టం చేయడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే విడుదలైన 'కరుప్పు' సినిమా త్రిష కెరీర్‌కు మళ్లీ కొత్త ఊపును తీసుకొచ్చింది. తమిళనాడులో ఈ చిత్రం మంచి వసూళ్లు సాధిస్తూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. దీంతో త్రిష కెరీర్ ముగిసిందని భావించిన విమర్శకులు కూడా ఇప్పుడు ఆమె సక్సెస్‌ను ప్రశంసిస్తున్నారు. ఈ విజయం తర్వాత త్రిష మళ్లీ వరుస సినిమాలతో బిజీ అవుతారా.. లేక ఎంపిక చేసిన కథలతో మాత్రమే ముందుకు వెళ్తారా అన్న చర్చ సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. త్రిష ఒకవేళ భవిష్యత్తులో సినిమాలకు విరామం ఇస్తే.. ఆమె స్థానం ఎవరు భర్తీ చేస్తారన్న చర్చ కూడా ఇండస్ట్రీలో మొదలైంది. ప్రస్తుతం కొత్త హీరోయిన్లు ఎంతోమంది వస్తున్నప్పటికీ.. సీనియర్ స్టార్ హీరోయిన్ల స్థాయిలో మార్కెట్‌ను నిలబెట్టుకోవడం అంత సులువు కాదని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో తమన్నా, కాజల్ అగర్వాల్ పేర్లు ముందుగా వినిపిస్తున్నాయి. తమన్నాకు ఇప్పటికీ అవకాశాలు వస్తున్నప్పటికీ.. మహిళా ప్రాధాన్యత ఉన్న సినిమాలను ఒంటరిగా విజయవంతం చేసే స్థాయిలో ఇటీవల ఆమెకు పెద్ద హిట్‌లు రావడం లేదు. మరోవైపు కాజల్ అగర్వాల్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించినప్పటికీ.. ఆశించిన స్థాయిలో మళ్లీ బలమైన మార్కెట్‌ను సొంతం చేసుకోలేకపోయారు. దీంతో త్రిష స్థాయిని పూర్తిగా భర్తీ చేయడం వీరికి అంత సులభం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక త్రిష స్థానం విషయంలో ఎక్కువగా వినిపిస్తున్న మరో పేరు నయనతారది. ఇప్పటికే దక్షిణాదిలో అత్యంత భారీ మార్కెట్ కలిగిన హీరోయిన్లలో నయనతార ముందంజలో ఉన్నారు. ఆమె నటిస్తున్న చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధిస్తున్నాయి. దీంతో త్రిష సినిమాలకు దూరమైతే.. ఆ మార్కెట్‌ను పూర్తిగా నయనతార తన ఆధీనంలోకి తెచ్చుకునే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. అయితే సినీ పరిశ్రమలో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయని, ఒక్క విజయంతోనే సమీకరణాలు పూర్తిగా మారిపోతాయని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం 'కరుప్పు' విజయంతో మళ్లీ వార్తల్లో నిలిచిన త్రిష.. ఈ అవకాశాన్ని ఎలా వినియోగించుకుంటారన్నదే ఇప్పుడు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.




## ఉప్పెనను మించిన ట్విస్ట్ ఉంటుంది

రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది'. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా బుచ్చిబాబు, రామ్ చరణ్ కార్ డ్రైవ్ చేస్తూ ఇంటర్వ్యూ నిర్వహించారు. 'మీకు ఇష్టమైన ఎపిసోడ్ ఏది?' అని దర్శకుడు అడగ్గా.. 'దిల్లీ ఎపిసోడ్ చాలా బాగుంటుంది. సినిమాలో నాకు ఇష్టమైన పార్ట్ అది. 'పెద్ది' మొత్తంలో ఎక్కువ మలుపులు ఉండేది ఆ ఎపిసోడ్‌లోనే కదా.. ఉప్పెనలో ట్విస్ట్ కంటే 100రెట్లు ఎక్కువ ఉంటుంది ఆ ఎపిసోడ్ అని చెప్పారు



## 'లగ్గం' సినిమా హీరోయిన్ హాట్ షో

దక్షిణాది సినీ పరిశ్రమలో తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న యువ నటి ప్రగ్యా నగ్రా మరోసారి సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ఆమె పంచుకున్న తాజా ఫొటోలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తూ విపరీతంగా వైరల్ అవుతున్నాయి. స్టైలిష్ లుక్స్, ట్రెండీ కాస్ట్యూమ్స్‌తో కనిపించిన ప్రగ్యా నగ్రా ఫొటోలకు అభిమానుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. ముఖ్యంగా యువత సోషల్ మీడియాలో ఈ ఫొటోలను విస్తృతంగా పంచుకుంటూ ప్రశంసలు కురిపిస్తోంది. హర్యానాలోని అంబాలాలో కాశ్మీరీ కుటుంబంలో జన్మించిన ప్రగ్యా నగ్రా చిన్నప్పటి నుంచే కళలపై ఆసక్తి పెంచుకున్నారు. ఆమె తండ్రి సైనికాధికారి కావడంతో దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. అనంతరం ఢిల్లీలో ఇంజినీరింగ్ చదివిన ఆమె, తర్వాత మోడలింగ్ రంగంలో అడుగుపెట్టి తన కెరీర్‌ను ప్రారంభించారు. వందకు పైగా వాణిజ్య ప్రకటనల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రగ్యా నగ్రా, తన అందం మరియు కెమెరా ముందు ఉన్న ఆత్మవిశ్వాసంతో సినీ అవకాశాలను అందుకున్నారు. రెండువేల ఇరవై రెండులో విడుదలైన తమిళ చిత్రం 'వరలారు ముఖ్యమ్' ద్వారా హీరోయిన్‌గా సినీ రంగ ప్రవేశం చేసిన ఆమె, తొలి సినిమాతోనే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. అనంతరం మలయాళంలో సుందరి యమునా' చిత్రంలో నటించి ప్రశంసలు అందుకున్నారు. తెలుగు ప్రేక్షకులకు 'లగ్గం' సినిమా ద్వారా పరిచయమైన ప్రగ్యా నగ్రా, తన సహజ నటనతో మంచి గుర్తింపును సంపాదించారు. ఇటీవల ఆమె సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న ఫొటోల్లో ఆధునిక దుస్తుల్లో గ్లామరస్‌గా కనిపించారు. ఫ్యాషన్, స్టైల్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించే ప్రగ్యా నగ్రా ప్రతి ఫొటోషూట్‌తో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. ఆమె ఫొటోలకు వేల సంఖ్యలో లైక్స్, కామెంట్లు వస్తుండగా, పలువురు సినీ అభిమానులు "గ్లామర్ క్వీన్", "స్టైలిష్ స్టార్" అంటూ కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రగ్యా నగ్రా చేతిలో పలు దక్షిణాది చిత్రాలు ఉన్నట్లు సమాచారం. వరుస ఫొటోషూట్లు, కొత్త ప్రాజెక్టులతో ఆమె సినీ రంగంలో మరింత బిజీగా మారుతున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.

# చిరంజీవి 158వ చిత్రం

## క్లాప్ కొట్టిన తమ్ముడు పవన్‌కల్యాణ్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా 158వ చిత్రం గురువారం మొదలైంది. కె.ఎస్.రవీంద్ర (బాబీ కొల్లి) దర్శకత్వంలో కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై కె. నారాయణ నిర్మిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోలో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ క్లాప్ కొట్టారు. చిరంజీవి కుమార్తె సుస్మిత కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకుడు వి.వి.వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. అయితే ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆసక్తికర విషయాలు చోటు చేసుకున్నాయి. అన్నపూర్ణ స్టూడియోకు చిరంజీవి, తన సోదరుడు పవన్‌కల్యాణ్ ఒకే కారులో వచ్చారు. తదుపరి నాగబాబు జాయిన్ అయ్యారు. ముగ్గురు కలిసి ఒకే సోఫాలో కూర్చుని చక్కగా ముచ్చటించుకున్నారు. చిరంజీవి పక్కన ఉన్నంత సేపు పవన్ ఎంతో వినయంగా ఉన్నారు. ఈ దృశ్యాన్ని చూసి అభిమానులు సంబరపడిపోయారు. చాలాకాలం తర్వాత ముగ్గురు సోదరులను ఒకే వేదికపై చూడటం కనుల విందుగా ఉందంటూ కామెంట్స్ చేస్తున్నారు. అలాగే చిరంజీవి, పవన్ కల్యాణ్, రామ్‌చరణ్ ఫొటోలను చిత్రించిన పట్టు శాలువాతో చిరంజీవిని సన్మానించింది చిత్ర బృందం. మరో ఆసక్తికర విషయం ఏంటంటే.. పవన్‌కల్యాణ్‌కి భక్తుడైన బండ్ల గణెళిశ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బండ్లను చూడగానే పవన్ దగ్గరకు తీసుకుని భుజంపై చేయి వేసి మాట్లాడుతూ లోపలికి తీసుకెళ్లారు. ఆ కాసేపు బండ్ల మొహం హై వోల్టేజ్ బల్బ్‌లా వెలిగిపోయింది. ఎప్పటిలాగే వినయంగా చేతులు కట్టుకుని మాట్లాడారు బండ్ల గణెళిశ్. చిరంజీవి సైతం బండ్లను హత్తుకున్నారు. అభిమానులు మాత్రం 'బండ్లన్నకు ఇవాళ పండగే.. ఆయన అభిమానించే హీరోలతో సరదాగా కాసేపు ముచ్చటించారు. ఈ రోజు ఆయనకు నిద్ర పట్టదేమో' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి అనశ్వర రాజన్ కూడా హాజరయ్యారు. ఈ చిత్రంలో ఆమె చిరుకు కుమార్తెగా కనిపించనున్నట్లు టాక్ నడుస్తోంది.



## చిరుకు కూతురిగా అనస్వర

చిత్రపరిశ్రమలో ఎప్పుడు ఎవరిని అదృష్టం వరిస్తుందో చెప్పడం చాలా కష్టం. కొంతమందికివరుస విజయాలు అందుకున్నా కొన్నిసార్లు ఛాన్స్‌లు రావు. మరికొంతమందికి ఒక్క సినిమా చేసినా మెగా ఛాన్స్ వచ్చేస్తోంది. తాజాగా మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ రెండో కేటగిరిలో ఉందని చెప్పొచ్చు. చిన్న చిన్న పాత్రలు చేస్తూ కెరీర్‌ను ప్రారంభించిన ఈ బ్యూటీ ప్రస్తుతం స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతోంది. ఛాంపియన్ సినిమాతో అనస్వర తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది. రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయ్యి మిక్స్ టాక్‌ను అందుకుంది. సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయినా అనస్వర న్యాచురల్ యాక్టింగ్‌కి తెలుగు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అమ్మడికి టాలీవుడ్‌లో మంచి భవిష్యత్ ఉంటుందని జోస్యం కూడా చెప్పారు. ఇప్పుడు ఆ జోస్యం నిజమైంది. ఈ చిన్నది తన రెండో సినిమానే మెగాస్టార్ చిరంజీవితో చేస్తోంది. మెగాస్టార్ చిరంజీవి- బాబీ కొల్లి కాంబోలో వస్తోన్న చిత్రం మెగా 158. ఇక ఈ చిత్రంలో అనస్వర ఒక కీలక పాత్రలో నటించబోతోంది. చిరుకు కూతురిగా ఆమె నటిస్తోందని తెలుస్తోంది. ఎన్నోఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న హీరోయిన్లకు రాని మెగా ఛాన్స్ రెండో సినిమాకే ఈ మలయాళ బ్యూటీకి దక్కడం నిజంగా ఆమె అదృష్టమని నెటిజన్స్ అంటున్నారు.



The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.